MAHILA SADHIKARATHA

# మహిళా సాధికారత

స్వయంసహాయ ఉద్యమ సమాచార తెలుగు మాస పత్రిక

mas

సంపుటి : 24 సంచిక: 12 రంగారెడ్డి ఆగస్ట్ 2026 పేజీలు : 36 వెల : రూ. 10/-

## ఏపిమాస్ రజతోత్సవ రమణీయ ఘట్టం!




జ్యోతి ప్రజ్వలనతో ఏపిమాస్ రజతోత్సవాలను ప్రారంభించిన తెలంగాణా గవర్నర్ శ్రీ శివ ప్రతాప్ శుక్లా.. గవర్నర్ గారికి సన్మానం

## ముఖ్యమంత్రి చేతిలో రజతోత్సవ సంకేతం!




ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి శ్రీ చంద్రబాబు నాయుడు గారికి రజతోత్సవ ప్రచురణను అందజేసిన శ్రీ సి ఎస్ రెడ్డి

## రజతోత్సవానికి వన్నె తెచ్చిన ఎందరో మహానుభావులు !



కె. మాధవరావు



టకర్



మహావర అలీ



ఫెర్నాండెజ్



కొప్పుల రాజు



జయేష్ రంజన్



జనార్దన్ రెడ్డి



నందితారే



జె పి



టీ విజయ్ కుమార్



సిఎస్ రెడ్డి



రెడ్డి సుబ్రహ్మణ్యం



ఆనితారామచంద్రన్



దాన కిశోర్



అనిల్ కుమార్



తెలంగాణా మంత్రి
శ్రీమతి సీతక్కకు రజతోత్సవ
జ్ఞాపికను అందజేసిన
శ్రీ సి ఎస్ రెడ్డి

## మహాభినిష్క్రమణం!



ఏపిమాస్ వ్యవస్థాపక ఛైర్మన్ డాక్టర్
పి కోటయ్య గారు కన్నుమూశారు.
కొద్దిరోజుల ముందుగా ఆయనకు
ఆయన యింటి వద్ద ఏపిమాస్ రజతోత్సవ
జ్ఞాపికను అందజేసిన శ్రీ సి ఎస్ రెడ్డి

NABARD

నాబార్డ్ సౌజన్యంతో ....

# రైతు ఉత్పత్తిదారుల సంఘాలు (ఎఫ్.పి.ఓ)

సహకారమే పునాదిగా సంఘాల బలోపేతం
సేవలే ఆధారంగా ప్రగతి దిశలో రైతుల పయనం

## చేపట్టే పనులు




NABARD

# మహిళా సాధికారత

సంపుటి 24 సంచిక 12




సంపాదకీయం

## మహనీయునికి స్మృత్యంజలి !

**ఆ**యన ఎంతో నిరాడంబరంగా, సాదాసీదాగా  మన మధ్యనే వుంటూ, ప్రగతి ప్రమాణానికి, వ్యక్తిత్వ వైభవానికి, విలువల సోపాన పథానికి నిలువెత్తు నిదర్శనంగా నిలిచిన మహనీయుడు. ఆంధ్రప్రదేశ్‌లోని ఒక చిన్న పట్టణంలో ఊపిరిపోసుకున్న చిరుదివ్వె, విశ్వవ్యాప్తంగా వెలుగులు విరజిమ్మిన అసాధారణ జీవన ప్రస్థానం ఆయనది. గ్రామీణాభివృద్ధి, బ్యాంకింగ్, వ్యవసాయ పరపతి రంగాలలో అనేక సంస్కరణలకు ఆయనే మూలం. ఆయనే ఇటీవల (జులై 23న) కన్నుమూసిన ఏపిమాస్  వ్యవస్థాపక తొలి ఛైర్మన్, నాబార్డ్ విశ్రాంత ఛైర్మన్ డాక్టర్ పమిడి కోటయ్య! ఆయన నిర్వహించిన ఉన్నత పదవి నాబార్డ్ విశ్రాంత ఛైర్మన్ అనే చాలామంది అనుకుంటారు. కాని, ఆయన ప్రపంచ బ్యాంక్, ఐక్యరాజ్య సమితితో సహా అనేక ప్రపంచస్థాయి సంస్థలకు సలహాదారుగా వున్నారు. ఇక, జాతీయ స్థాయిలో ఆయన ఎన్నో సంస్థలలో ఛైర్మన్, డైరెక్టర్ వంటి  కీలక పదవులు నిర్వహించారు. ఏపిమాస్‌తో సహా, ఏడెనిమిది ప్రముఖ ప్రభుత్వేతర సంస్థలలో కూడా ఆయన మార్గదర్శక బాధ్యతలు నిర్వహించారు. దాదాపు 40 దేశాలు ఆయన సేవలు పొందాయంటే ఆయన మేధా విభవానికి, నిర్వహణ సామర్థ్యానికి అంతకంటె నిదర్శనం మరేమి కావాలి? ఇక, ఏపిమాస్ తొలి ఛైర్మన్ గానే కాదు, ఈ సంస్థ రూపురేఖలు సంతరించుకోవడంలో, ఆవిర్భావంలో, తొలి అడుగులు వేయడంలో కూడా ఆయన ఎంతో బాధ్యతాయుతమైన పాత్ర పోషించారు. గ్రామీణాభివృద్ధి, పేదరిక నిర్మూలన, మహిళా సాధికారత కార్యక్రమాలకు ఆయన పెద్దపీట వేసేవారు. భాగస్వామ్యాలతో సంస్థను బలోపేతం చేయడంపట్ల ఆయన శ్రద్ధ వహించేవారు. సాధారణ వ్యక్తుల ఊహకు సైతం అందనంతగా, యింతటి ఎత్తుకు ఎదిగినా, ఆయన ఎలాంటి భేషజాలు లేకుండా ఎంతో నిరాడంబరంగా వుండేవారు. క్రమశిక్షణ పాటించేవారు. ఛైర్మన్ అయి వుండికూడా, దాదాపు ప్రతిరోజూ ఏపిమాస్ కార్యాలయానికి వచ్చేవారు. ఫైళ్ళు చూసేవారు. సిబ్బందిలో ఎవరైనా ఆయన గదిలోకి వెళ్ళవచ్చు, సలహాలు పొందవచ్చు, సందేహాలు నివృత్తి చేసుకోవచ్చు. ఎలాంటి అరమరికలు లేకుండా అందరితో నవ్వుతూ వ్యవహరించేవారు. జులై 1,2 తేదీలలో జరిగిన ఏపిమాస్ రజతోత్సవాలలో అనారోగ్య కారణంగా ఆయన పాల్గొనలేకపోయారు. ఆ తర్వాత నేను, ఏపిమాస్ ప్రస్తుత ఛైర్మన్ శ్రీ కాకి మాధవరావు గారితో కలసి, ఆయన యింటికివెళ్ళి, రజతోత్సవ విశేషాలను ఆయనకు వివరించి, జ్ఞాపికను అందించి వచ్చాము. ఆయన ఎంతో కుతూహలంగా విన్నారు. మరి పది కాలాలపాటు ఏపిమాస్ సమాజసేవ చేయాలని ఆకాంక్షించారు. ఆశీర్వదించారు. కొద్ది రోజులలోనే ఆయన యిక లేరు అనే వార్త వినవలసి వస్తుందనుకోలేదు. ఆయన భౌతికంగా మనకు దూరమైనా, ఆయన స్ఫూర్తి అనునిత్యం మాకు మార్గదర్శకత్వం వహిస్తూనే వుంటుంది. ఆ మహనీయుని దివ్య స్మృతికి  ఏపిమాస్ కుటుంబమంతా నివాళులు అర్పిస్తున్నాము.ఆయన కుటుంబ సభ్యులకు మా ప్రగాఢ సానుభూతి.

## నూతనోత్సాహం !

**జు**లై 1,2 తేదీలలో జరిగిన సంస్థ రజతోత్సవాలు ఏపిమాస్‌లో నూతనోత్సాహాన్ని నింపాయి. తాను ఎంచుకున్న మార్గంలో, 25 ఏళ్ళుగా సాగిస్తున్న ప్రస్థాన పథంలో, మరింత అంకితభావంతో, మరింత పూనికతో సమాజసేవను కొనసాగించే మనోబలాన్ని ఈ ఉత్సవాలు అందించాయి. పలువురు ప్రముఖులు ఈ ఉత్సవాలలో పాల్గొని, భవిష్యత్ కార్యాచరణకు ఎన్నో  విలువైన సూచనలు చేశారు, సలహాలు అందించారు. వారందరికీ పేరుపేరునా ధన్యవాదాలు. స్వయంగా పాల్గొని, ఉత్సవాలకు శ్రీకారంచుట్టి, విలువైన సందేశాన్ని అందించిన తెలంగాణా గవర్నర్ శ్రీ శివప్రతాప్ శుక్లా గారికి, రజతోత్సవ ప్రచురణను స్వీకరించి, వెన్నుతట్టి, మరింత స్ఫూర్తిమంతంగా సేవా కార్యక్రమాలను కొనసాగించమని ఆకాంక్షించిన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారికి ప్రత్యేక కృతజ్ఞతలు. ఈ ఆత్మీయ సందేశాల సమ్యక్ స్ఫూర్తితో, నిర్దేశించుకున్న లక్ష్య సాధనకు, ఆ స్వప్న సాకారానికి ఏపిమాస్ ఎప్పటికప్పుడు మరింత కృషి చేస్తూనే వుంటుంది.


**Edited, Printed, Published and owned by T.Chandra Sekhar Reddy; Printed at Kala Jyothi Process Pvt Ltd, Plot No.CFC-1&2, Survey No.18, E-city, SEZ, General Industrial Park, Raviryal and Srinagar, Maheswaram, Ranga Reddy District, Telangana - 501359 and Published at Mahila Abhivruddhi Society, Andhra Pradesh (APMAS), Plot No.11&12,HUDAColony, Tanesha Nagar, Near DreamVally, Manikonda,Ranga Reddy District,Telangana-500089. Editor:T.Chandra Sekhar Reddy**


లేనిదాని గురించి కుంగిపోకుండా వున్నదానితో సంతృప్తిగా, ప్రశాంతంగా జీవించడమే ఆనందం

# మహిళా సాధికారత

ఆగస్ట్ 2026

ఎడిటర్ : **టి.చంద్రశేఖర రెడ్డి** అసోసియేట్ ఎడిటర్ : **జె.వి. క్రిష్ణమూర్తి**

ఎడిటోరియల్ కమిటి: **జి. శ్రీనివాస్, ఎల్. భవాని, ఆర్ రమాదేవి, ఎం. భార్గవి, కె శ్రీనివాస్, ఆర్ బ్రహ్మచారి**

**కంపోజింగ్, డిజైనింగ్ : ఎన్. రమాదేవి , కన్సల్టెంట్: కె. రఘురామరాజు**

**సమన్వయ సహకారం : పి. ఝాన్సీ లక్ష్మి , సాంకేతిక సహకారం: క్రిస్టాఫర్ వసంత్**

## లోపలి పేజీలలో ....

➪ ఏపిమాస్ రజతోత్సవ జాతీయ సదస్సు 05
➪ విశ్వాసానికి,జీవననవచైతన్యానికి ప్రతీక ఏపిమాస్ 11
➪ 'తెలంగాణ రైజింగ్ విజన్-2047' 12
➪ విశ్వవ్యాప్త సేవాస్ఫూర్తి డాక్టర్ పమిడి కోటయ్య! 13
➪ ఏపిమాస్‌కు డాక్టర్ కోటయ్య నాయకత్వం! 15
➪ *శత శతమానం భవతి* .... ! 17
➪ అభివృద్ధి తీరు మారాలి.... 18
➪ స్వయంసహాయంలో స్వయంప్రతిపత్తి పెరగాలి 19
➪ వ్యాపారసంస్థలుగా ఎదిగితేనే ఎఫ్‌పిఓలకు మనుగడ 20
➪ ప్రతికూలవాతావరణాన్ని తట్టుకునే వ్యవసాయమే.. 21
➪ సమాజ ఆధారిత ఆరోగ్యసంరక్షణ విధానాలవసరం 22
➪ పి4 కార్యక్రమంపై కుప్పంలో ముఖ్యమంత్రి సమీక్ష 23
➪ ఆశా కార్యకర్తల సామర్థ్యం పెంపుదలకు శిక్షణ 25
➪ ఎఫ్-డయాగ్రమ్ సమాజానికందిస్తున్న సందేశం 26
➪ 'వాష్' పై మంచిర్యాల జిల్లాస్థాయి కార్యశాల! 28
➪ తెలంగాణ జిల్లాసమాఖ్యల పధాధికారులకుశిక్షణ 30
➪ పిల్లల పోషణపై అవగాహనకోసర అన్నప్రాశన 32
➪ 'వాష్ 'తోడ్పాటుతో వాటర్‌ప్లాంట్ ఏర్పాటు 33
➪ గ్రామీణాభివృద్ధిలో ఏపీకి జాతీయ గుర్తింపు 34

## 'మహిళాభివృద్ధి సొసైటీ' (ఏపిమాస్)

**'మ**హిళా సాధికారత' పత్రిక మాతృసంస్థ మహిళాభివృద్ధి సొసైటీ. దీనిని ఏపిమాస్ అని, మాస్ అని కూడా సంక్షిప్తంగా పిలుస్తారు. 2001జూన్ 14 వ తేదీన పబ్లిక్ సొసైటీగా మహిళాభివృద్ధి సొసైటీ హైదరాబాద్ ప్రధాన కార్యాలయంగా ఏర్పాటైంది. తెలుగు రాష్ట్రాలలో, మన దేశంలోని ఇతర అనేక రాష్ట్రాలలో మహిళా స్వయంసహాయ సంస్థల సుస్థిరాభివృద్ధికి విశేష సేవలను అందించిన ఈ సంస్థ ప్రస్తుతం రైతుల అభ్యున్నతికి, పర్యావరణ పరిరక్షణకు, ఆదర్శ గ్రామాల నిర్మాణానికి, స్వయంసహాయ సంస్థల స్వయం నియంత్రణకు గణనీయమైన కృషి చేస్తున్నది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు ప్రధాన కార్యదర్శిగా పని చేసి పదవీ విరమణ చేసిన శ్రీ కె. మాధవరావు ఛైర్మన్‌గా వివిధ రంగాలలో విశేషానుభవం గడించిన ప్రముఖులు ఈ సంస్థ పాలకవర్గంలో వున్నారు. సంస్థ వ్యవస్థాపక సి ఇ ఓ శ్రీ సి ఎస్ రెడ్డి ఎండి గా, సిఇఓ గా వున్నారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్, తెలంగాణా, బీహార్‌లలో కార్యక్రమాలను నిర్వహిస్తున్న ఈ సంస్థకు ప్రధాన కార్యాలయంతో పాటు, ఒక ప్రాంతీయ కార్యాలయం, 21 క్షేత్ర కార్యాలయాలు వున్నాయి. దాదాపు 250 మందికి పైగా సిబ్బంది వున్నారు. ప్రజలకు అవగాహన కలిగించడం కోసం 'మహిళా సాధికారత' పత్రికతో పాటు వివిధ వైజ్ఞానిక పుస్తకాలను, ఈ సంస్థ ప్రచురిస్తుంటుంది.

| ప్రోత్సాహక చందా | | |
|---|---|---|
| ఏడాదికి | : | రూ. 110 |
| రెండేళ్లకు | : | రూ. 200 |
| మూడేళ్లకు | : | రూ. 280 |

| ప్రకటన ఛార్జీలు | |
|---|---|
| మల్టీకలర్ ఫస్ట్ పేజి (సగం)/బ్యాక్ పేజి(పూర్తి) | : రూ. 25,000 |
| మల్టీకలర్ ఇన్‌సైడ్ కవర్ పేజి (పూర్తి) | : రూ. 15,000 |
| బ్లాక్ అండ్ వైట్ లోపలి పేజి (పూర్తి) | : రూ. 10,000 |

**చందాలు లేదా ప్రకటనలకోసం పంపే డిడిలను 'ఏపిమాస్ -హైదరాబాద్' పేరుమీద పంపాలి**

మహిళా సాధికారత, ఏపిమాస్ కార్యాలయం, ప్లాట్ నెం.11-12, హుడా కాలని, తానీషా నగర్,
డ్రీమ్‌వ్యాలీ దగ్గర, మణికొండ, రంగారెడ్డి జిల్లా, హైదరాబాదు-500089. ఫోన్ : 08413-403118
Web: www.apmas.org, E Mail: info@apmas.org

ఆశాభావం అంటే సమస్యలలో పరిష్కారాన్ని , ఆటంకాలలో అవకాశాలను చూడగలిగేలా చేసేది

# ఏపిమాస్ రజతోత్సవ జాతీయ సదస్సు

**అది ఒక సంకల్ప దీక్షకు, ఒక సంఘటిత ప్రేరణకు, ఒక సహకార స్ఫూర్తికి, ఒక ప్రగతి గమన నిబద్ధతకు, ఒక కార్యాచరణ దీప్తికి 'వెండి తొడుగు' లభించిన రోజు! సమాజమే దేవాలయం, జన హితమే పరమ మంత్రం అనే పెద్దల మాటను తలదాల్చి ఏపిమాస్ అనే సంస్థ 25 సంవత్సరాలపాటు నిష్కళంకంగా, అంకిత భావంతో చేసిన సేవ ప్రజల విశ్వాసాన్ని చూరగొని , ఆ విశ్వాసం దినదిన ప్రవర్ధమానమై, ఆ సంస్థ మహదాశయ స్వప్న సాకారంలో ఎన్నో ముందదుగులు వేసి, మరెన్నో జనాభ్యుదయ కార్యక్రమాలకు ఆత్మ విశ్వాసాన్ని ఇనుమడింపజేసిన రోజు. ఆదే ... ఏపిమాస్ రజతోత్సవ పర్వదినం. ఆ వేడుక జరిగిన తీరును చూద్దాం ...**

ఏపిమాస్ చారిత్రాత్మక రజతోత్సవ మైలురాయిని పురస్కరించుకుని, 2026 జూలై 1–2 తేదీలలో హైదరాబాద్ లోని డా. ఎం.సి.ఆర్. హెచ్ఆర్డీ ఇన్స్టిట్యూట్‌లో "సమ్మిళిత అభివృద్ధికి సమాజ ఆధారిత మార్గాలు (కమ్యూనిటీ – లెడ్ పాత్‌వేస్ ఫర్ ఇన్‌క్లూజివ్ గ్రోత్)" అనే అంశంపై జాతీయ సదస్సును ఏపిమాస్ నిర్వహించింది.

రెండు రోజుల పాటు నిర్వహించిన ఈ సదస్సును



ఈ సదస్సులో ప్రముఖ విధాన రూపకర్తలు, సీనియర్ ప్రభుత్వ అధికారులు, అభివృద్ధి రంగ నిపుణులు, పరిశోధకులు, ఆర్థిక సంస్థల ప్రతినిధులు, కార్పొరేట్ రంగ ప్రముఖులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, అలాగే దేశ వ్యాప్తంగా ఉన్న గ్రామీణ సమాజ సంస్థల నాయకులు పాల్గొన్నారు. సమాజ ఆధారిత అభివృద్ధి సాధించిన విజయాలను సంబరంగా జరుపుకోవడంతో పాటు, భవిష్యత్తులో ఎదురయ్యే అవకాశాలు, సవాళ్లపై సమగ్రంగా చర్చించేందుకు ఈ సదస్సు జాతీయ వేదికగా నిలిచింది.

భారత దేశ సమ్మిళిత అభివృద్ధి లక్ష్యాలకు అనుగుణంగా అత్యంత ఆలోచనాత్మకంగా రూపకల్పన చేశారు. ప్రారంభ సమావేశంలో ఏపీఎంఏఎస్ ఇరవై ఐదు సంవత్సరాల సేవా ప్రస్థానాన్ని స్మరించుకుంటూ, సంస్థ వ్యవస్థాపకులు, అభివృద్ధి

స్వప్నానికి సంకల్పానికి ఒకటే తేడా . . . నిదురపడితే వచ్చేది స్వప్నం, నిదురపట్టనివ్వనిది సంకల్పం

భాగస్వాములు, సమాజ నాయకుల విశిష్ట సేవలను ఘనంగా సత్కరించారు. అనంతరం "ఏపిమాస్ పరిణామం-భవిష్యత్ అవకాశాలు" అనే అంశంపై నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో, గత పాతికేళ్లలో సమాజ సంస్థల నిర్మాణం, బలోపేతంలో ఏపిమాస్ పోషించిన కీలక పాత్రను సమీక్షిస్తూ, భవిష్యత్ దిశపై సమగ్ర చర్చ జరిగింది.

తదుపరి సాంకేతిక సమావేశాలు సమాజ ఆధారిత అభివృద్ధికి సంబంధించిన పలు కీలక అంశాలను విశ్లేషించాయి. సమ్మిళిత అభివృద్ధికోసం సమాజ ఆధారిత దృక్పథాన్ని పునర్నిర్వచించడం, స్వయం సహాయక సంఘాలు (ఎస్‌హెచ్ జీస్), వాటి సమాఖ్యల రూపాంతర పాత్ర, రైతు ఉత్పత్తిదారుల సంస్థలు (ఎఫ్‌పిఓ లు) సుస్థిర వ్యాపారసంస్థలుగా ఎదగడానికి అవసరమైన మార్గాలు, వ్యవసాయ పర్యావరణ (ఆగ్రో ఎకాలజీ) ఆధారిత, వాతావరణ మార్పు లకు అనుకూలమైన వ్యవసాయ విధానాలు, అలాగే నీరు, పారిశుద్ధ్యం - పరిశుభ్రత (వాష్) కార్యక్రమాలను పోషక ఆహారంతో సమన్వయం చేయడం ద్వారా ప్రజల ఆరోగ్యం, శ్రేయస్సును మెరుగుపరచే వ్యూహాలపై విస్తృత చర్చలు జరిగాయి.

అదనంగా, తెలంగాణ విజన్-2047, సమాజ సంస్థల ద్వారా జీవనోపాధుల సమన్వయం, ఏపిమాస్ అమలు చేసిన క్లైమేట్ స్మార్ట్ విలేజెస్ (క్లైమేట్ స్మార్ట్ విలేజెస్) కార్యక్రమంపై మూల్యాంకన ఫలితాల ప్రజెంటేషన్లు నిర్వహించబడ్డాయి. ఈ చర్చలు గ్రామీణ స్థాయి అనుభవాలను అభివృద్ధి విధానాలు, భవిష్యత్ కార్యాచరణ దిశలతో అనుసంధానించాయి. సదస్సు మొత్తం మీద, పాల్గొన్న ప్రతినిధులు పరిశోధన ఆధారిత ఆధారాలు, క్షేత్రస్థాయి అనుభవాలు, వినూత్న ఆచరణలు, విధానపరమైన సూచనలను పంచు కుంటూ, స్థిరమైన, సమ్మిళిత అభివృద్ధి సాధనలో సమాజ సంస్థల ప్రాధాన్యాన్ని పునరుద్ఘాటించారు.

ఏపిమాస్ తన తదుపరి ప్రస్థానంలోకి అడుగు పెడుతున్న ఈ సందర్భంలో, సమాజ నాయకత్వంలోని సంస్థలే మరింత సమానత్వంతో కూడిన, స్వావలంబన గల, సుస్థిర భారత నిర్మాణంలో కీలకమైన శక్తిగా కొనసాగుతాయని ఈ జాతీయ సదస్సు స్పష్టంగా పునరుద్ఘాటించింది.

**రజతోత్సవం**

ఏపిమాస్ రజతోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన జాతీయ సదస్సు ఘనమైన ప్రారంభోత్సవ సమావేశంతో ఆరంభమైంది. గత ఇరవై ఐదు సంవత్సరాలుగా సమాజ ఆధారిత సంస్థల బలోపేతం, సమగ్ర గ్రామీణాభివృద్ధి, పేదరిక నిర్మూలన, మహిళా సాధికారత, జీవనోపాధుల అభివృద్ధికి ఏపిమాస్ అందించిన విశిష్ట సేవలను ఈ సమావేశం స్మరించుకుంది.

తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శ్రీ శివ ప్రతాప్ శుక్లా గారు ముఖ్య అతిధిగా పాల్గొన్న ఈ రెండురోజుల కార్యక్రమ ప్రారంభ సదస్సుకు విధాన రూపకర్తలు, అభివృద్ధి రంగ నిపుణులు, ఏపిమాస్ వ్యవస్థాపకులు, ప్రభుత్వ ఉన్నతాధికారులు, ఆర్థిక సంస్థల ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, రైతు ఉత్పత్తిదారుల సంస్థలు (ఎఫ్ పి ఓలు), స్వయం సహాయ సమాఖ్యల (ఎస్ హెచ్ జి లు) ప్రతినిధులు, దేశం నలుమూలల నుంచి వచ్చిన అభివృద్ధి రంగ భాగస్వాములు, ఇతర విశిష్ట అతిథులు హాజరయ్యారు.

శ్రీ వేద్ స్వాగత వచనాలు, 'వందే మాతరం' గానం, గవర్నర్ శ్రీ శ్రీ శివ ప్రతాప్ శుక్లా గారు, ఇతర విశిష్ట అతిథులచే సంప్రదాయబద్ధంగా జ్యోతి ప్రజ్వలన అనంతరం రజతోత్సవ వేడుకలను అధికారికంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమం సమాజ ఆధారిత ప్రగతి, సామాజిక సమ్మిళితత్వం, సుస్థిర గ్రామీణాభివృద్ధి పట్ల అందరి ఉమ్మడి నిబద్ధతకు ప్రతీకగా నిలిచింది.

**అతిథులకు ఆహ్వానం**

శ్రీమతి నివేదిత స్వాగత వచనాలతో, గవర్నర్ గారిని, ఇతర విశిష్ట అతిథులకు రజతోత్సవ వేడుకలకు, జాతీయ సదస్సుకు ఆహ్వానించారు.

**స్వావలంబనతోనే సుస్థిరాభివృద్ధి: శ్రీ సి.ఎస్. రెడ్డి**

ఏపిమాస్ ముఖ్య కార్యనిర్వాహణాధికారి శ్రీ సి.ఎస్. రెడ్డి తన ప్రసంగంలో, చిన్న స్థాయిలో ప్రారంభమైన ఏపిమాస్ నేడు దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన సమాజ ఆధారిత సంస్థల బలోపేతానికి కట్టుబడి ఉన్న ప్రముఖ సంస్థగా ఎదిగిన విధానాన్ని వివరించారు. స్థిరమైన

**మార్పును తిరస్కరించేవాడు వినాశనం కోరుకునేవాడే ; అభివృద్ధి కోరుకోనిది ఒక్క శ్మశానం మాత్రమే !**

సమగ్రాభివృద్ధి సాధ్యమవ్వాలంటే సమాజమే తన సంస్థలను స్వయంగా నిర్మించుకుని, నిర్వహించి, పాలించగలగాలని ఆయన స్పష్టం చేశారు.

స్వయం సహాయక సంఘాలు (ఎస్‌హెచ్‌జిలు), ఎస్‌హెచ్‌జి సమాఖ్యలు, సహకార సంఘాలు, రైతు ఉత్పత్తిదారుల సంస్థలు (ఎఫ్‌పిఓలు) పేదరిక నిర్మూలన, మహిళా సాధికారత, జీవనోపాధుల మెరుగుదల, ఆర్థిక సమగ్రత, సామాజిక పరివర్తనకు శక్తివంతమైన వేదికలుగా ఎదిగాయని ఆయన పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, అభివృద్ధి సంస్థలు, ఆర్థిక సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, సమాజ నాయకులతో ఏర్పడిన దీర్ఘకాలిక భాగస్వామ్యాల వల్లే గ్రామీణ భారతదేశంలో ఏపిమాస్ దీర్ఘకాలిక ప్రభావాన్ని సృష్టించగలిగిందని ఆయన తెలిపారు.

**విశిష్ట సంస్థ ఏపిమాస్: శ్రీ కాకి మాధవరావు**

ఏపిమాస్ ఛైర్మన్ శ్రీ కాకి మాధవరావు గారు అధ్యక్ష ప్రసంగంలో, సమాజ ఆధారిత అభివృద్ధికి అంకితమైన భారతదేశంలోని విశిష్ట సంస్థల్లో ఏపిమాస్ ఒకటిగా నిలిచిందని పేర్కొన్నారు. వృత్తిపరమైన నైపుణ్యాన్ని గ్రామీణ స్థాయి అనుభవంతో సమన్వయం చేస్తూ, స్వయం సహాయక సంఘాల ఉద్యమం, గ్రామీణ జీవనోపాధుల అభివృద్ధి, కమ్యూనిటీ సంస్థల బలోపేతంలో ఏపిమాస్ విశేష సేవలు అందించిందని కొనియాడారు. సంస్థ డైరెక్టర్ల మండలి, వ్యవస్థాపకులు, ఏపిమాస్ బృందం అందించిన నాయకత్వాన్ని అభినందిస్తూ, గ్రామీణ సమాజాల సామాజిక, ఆర్థిక సాధికారతకు సంస్థ ఇరవై ఐదు సంవత్సరాలుగా అంకిత భావంతో పని చేస్తోందని ప్రశంసించారు.

**జీవనోపాధులతోనే అసలైన ప్రగతి : టక్కర్**

భారతదేశంలో కమ్యూనిటీ సంస్థల ఉద్యమం ఎలా అభివృద్ధి చెందిందో వివరిస్తూ శ్రీ ఎస్.పీ. టక్కర్ గారు స్వయం సహాయక సంఘాల ఉద్యమం ప్రారంభ దశలో కొన్ని లక్షల సంఘాల నుంచి నేడు సుమారు డెబ్బై లక్షలకు పైగా ఎస్‌హెచ్‌జిలు, దాదాపు పది కోట్ల మహిళా సభ్యులతో విస్తరించిన గొప్ప ప్రస్థానాన్ని వివరించారు.

చిత్తూరు జిల్లాలో ప్రారంభమైన వినూత్న ప్రయత్నాలను ఆయన స్మరించుకుంటూ, ఈ ఉద్యమానికి బలమైన పునాదులు వేసిన అభివృద్ధి నాయకులకు నివాళులర్పించారు.

భవిష్యత్తులో కేవలం సంఖ్యల ఆధారంగా విజయాన్ని కొలవకుండా, స్థిరమైన జీవనోపాధులను సృష్టించే కార్యాచరణ ప్రణాళికలపై దృష్టి సారించాల్సిన అవసరాన్ని ఆయన నొక్కిచెప్పారు. డిజిటల్ పరిపాలన, సమగ్ర డేటా వ్యవస్థలు, కృత్రిమ మేధస్సు (ఏఐ), సాంకేతికత ఆధారిత సేవలు కమ్యూనిటీ సంస్థలను మరింత బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు.

వ్యవసాయం, పశుసంవర్ధక, మత్స్య, ఇతర అనుబంధ రంగాల సమగ్ర అభివృద్ధితో పాటు, భారతదేశ ఆర్థిక వృద్ధి నిజమైన పేదరిక నిర్మూలనకు దోహదపడేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరాన్ని ఆయన సూచించారు.

**మహిళా నిర్వాహక పరిశ్రమలు ప్రధానం: శ్రీ దాన కిషోర్**

తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శ్రీ ఎం. దాన కిషోర్, స్వయం సహాయక సంఘాల ఉద్యమం ద్వారా మహిళా సాధికారతలో సాధించిన విశేష పురోగతిని ప్రశంసించారు. గ్రామీణ స్థాయిలో బలమైన సంస్థలను నిర్మించడంలో సెర్ప్ వంటి సంస్థలు అందించిన సేవలను గుర్తించి, మహిళల ఆధ్వర్యంలోని పారిశ్రామిక సంస్థలు, వ్యాపార నమూనాలను మరింత విస్తరించాలని పిలుపు నిచ్చారు. ప్రభుత్వ పథకాల సహకారాన్ని సమర్థవంతంగా వినియోగించుకుంటూ గ్రామీణ యువత, మహిళల్లో ఆవిష్కరణలు, స్టార్టప్‌లు, నైపుణ్యాభివృద్ధి, సాంకేతికత వినియోగాన్ని ప్రోత్సహించాలని సూచించారు. సమగ్ర ఆర్థికాభివృద్ధి కోసం గ్రామీణ వలసలను తగ్గిస్తూ స్థానికంగా స్థిరమైన ఉపాధి అవకాశాలు సృష్టించడం, స్థానిక వనరులకు విలువ జోడించే కార్యక్రమాలను ప్రోత్స హించడం అవసరమని ఆయన పేర్కొన్నారు.

**ప్రచురణల ఆవిష్కరణ, సన్మానాలు**

సిల్వర్ జూబ్లీ వేడుకల సందర్భంగా, ఏపిమాస్ ఇరవై ఐదు సంవత్సరాల ప్రస్థానాన్ని, అలాగే సామాజిక సంస్థల విజయాలను ప్రతిబింబించే మూడు ప్రచురణలను ఈ సదస్సులో ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా ఏపిమాస్ స్థాపకులు, అభివృద్ధి రంగ నాయకులు, భాగస్వామ్య సంస్థల ప్రతినిధులు గత ఇరవై ఐదు సంవత్సరాలుగా సంస్థ అభివృద్ధికి అందించిన విశిష్ట సేవలను గుర్తిస్తూ వారిని ఘనంగా సన్మానించారు.

**ఏపిమాస్ వికాసం – భవిష్యత్ అవకాశాలు**

"ఏపిమాస్ వికాసం … భవిష్యత్ అవకాశాలు" అనే ప్రత్యేక సదస్సులో సంస్థ గత ఇరవై ఐదు సంవత్సరాల ప్రస్థానాన్ని సమగ్రంగా సమీక్షించారు. స్థాపకులు, అభివృద్ధి నిపుణులు, విధాన నిర్ణేతలు, రంగ నాయకులు పాల్గొన్న ఈ సమావేశంలో 2001లో ప్రారంభమైన ఏపిమాస్, నేడు దేశవ్యాప్తంగా స్వయం సహాయక సంఘాలు (ఎస్‌హెచ్‌జిలు), ఎస్‌హెచ్‌జి సమాఖ్యలు, రైతు ఉత్పత్తిదారుల సంస్థలు (ఎఫ్‌పిఓస్) మరియు ఇతర సామాజిక సంస్థలను బలోపేతం చేసే జాతీయ స్థాయి సంస్థగా ఎలా ఎదిగిందో విశ్లేషించారు.

**ఏపిమాస్ సుస్థిరాభివృద్ధి మంత్రం:నందితా రే**

డా. నందితా రే ఏపీమాస్ ప్రారంభ దశలను స్మరించుకుంటూ, గ్రామీణ సామాజిక సంస్థలను బలోపేతం చేయడంలో సంస్థ చూపిన అచంచల నిబద్ధతను ప్రశంసించారు. గ్రామీణాభివృద్ధి వ్యవస్థలో ఉన్న కీలక లోపాలను ఏపిమాస్ ఎప్పటికప్పుడు గుర్తించి, తాత్కాలిక కార్యక్రమాల అమలుకే పరిమితం కాకుండా, స్థిరమైన సామాజిక సంస్థలను నిర్మించడంపై దృష్టి సారించిందని పేర్కొన్నారు.

స్వయం సహాయక సంఘాలు (ఎస్‌హెచ్‌జిలు), ఎస్‌హెచ్‌జి సమాఖ్యలు, రైతు ఉత్పత్తిదారుల సంస్థలు (ఎఫ్‌పిఓలు) బలోపేతానికి సామర్థ్యాభివృద్ధి, సంస్థాగత వికాసం, దీర్ఘకాలిక మార్గదర్శకత్వం ద్వారా ఏపీమాస్ విశేష కృషి చేసిందని ఆమె వివరించారు. సమగ్ర సుస్థిరాభివృద్ధి సాధనకు సంస్థాగత నిర్మాణమే పునాది అని ఆమె నొక్కి చెప్పారు.

**సామాజిక పునాది: శ్రీ సుఖ్వీందర్ సింగ్ అరోరా**

ఏపీమాస్ ఆవిర్భావాన్ని స్మరించుకుంటూ, శ్రీ సుఖ్వీందర్ సింగ్ అరోరా సంస్థ ఏర్పాటుకు దారితీసిన పరిస్థితులను వివరించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం బ్రిటన్ అంతర్జాతీయ అభివృద్ధి శాఖ (డిఎఫ్ఐడి) మధ్య జరిగిన చర్చల్లో వేగంగా విస్తరిస్తున్న స్వయం సహాయక సంఘాల ఉద్యమాన్ని బలోపేతం చేయడానికి ప్రత్యేక సంస్థ అవసరమనే భావన ఏర్పడిందని తెలిపారు.

మహిళా సాధికారత కోసం పెద్దఎత్తున వనరులు సమీకరించబడుతున్నప్పటికీ, సంఘాల సామర్థ్యాభివృద్ధి, సంస్థాగత బలోపేతం, దీర్ఘకాలిక స్థిరత్వంపై దృష్టి సారించే స్వతంత్ర సంస్థ అవసరమైందని, ఆ ఆలోచనల ఫలితంగానే ఏపీమాస్ ఏర్పడిందని పేర్కొన్నారు.

సంస్థ ప్రారంభ వ్యూహాత్మక ప్రణాళికలు, "కేర్" వంటి సంస్థలతో భాగస్వామ్యాలు, సమాజ సంస్థల బలమైన వ్యవస్థకు ఏపీమాస్ వేసిన పునాదులను ఆయన గుర్తుచేశారు. భవిష్యత్తులో ఏపీమాస్ నూతన అభివృద్ధి సవాళ్లకు ఆవిష్కరణలు, ఆధారిత పరిశోధన, సమాజ యాజమాన్యంతో స్పందించే జ్ఞాన సంస్థగా కొనసాగాలని సూచించారు.

**ఎఫ్ పి ఓలకు వ్యాపారం నేర్పాలి: అనిల్‌కుమార్**

సమున్నతి ఫైనాన్స్ వ్యవస్థాపక ఛైర్మన్ శ్రీ అనిల్‌కుమార్ ఏపీమాస్‌తో తన అనుబంధాన్ని పంచుకుంటూ, రైతు ఉత్పత్తిదారుల సంస్థల (ఎఫ్‌పిఓస్) ప్రారంభ దశలో వాటి సంస్థాగత నిర్మాణం, సామర్థ్యాభివృద్ధి విధానాలను అధ్యయనం చేయడానికి ఏపీమాస్‌ను సందర్శించిన విషయాన్ని గుర్తు చేసుకున్నారు.

తెలుగు భాషలో రైతు ఉత్పత్తిదారుల సంస్థల కోసం సమగ్ర శిక్షణా మాన్యువల్స్, వనరుల పుస్తకాలను రూపొందించిన తొలి సంస్థలలో ఏపీమాస్ ఒకటని, ఇది ప్రాంతంలో ఎఫ్‌పిఓ ఉద్యమాన్ని విస్తరించడంలో ఎంతో దోహదపడిందని ప్రశంసించారు.

రైతుల సమీకరణ, సంస్థాగత నిర్మాణంలో ఏపీమాస్ నాయకత్వాన్ని కొనియాడుతూ, నేడు దేశవ్యాప్తంగా పని చేస్తున్న అనేక ఎఫ్‌పిఓ నిపుణులను, అభివృద్ధి కార్య కర్తలను ఈ సంస్థ తీర్చిదిద్దిందని పేర్కొన్నారు. చిన్న రైతులకు స్థిరమైన ఆర్థిక ప్రయోజనాలు అందించాలంటే, ఎఫ్‌పిఓలను వృత్తిపరంగా నిర్వహించబడే, వ్యాపార దృక్పథంతో పని చేసే సంస్థలుగా తీర్చిదిద్దాలని సూచించారు.

**మహిళలతోనే గ్రామీణ ప్రగతి: శ్రీ టి. విజయ్ కుమార్**

వాతావరణ మార్పులు గ్రామీణ జీవనోపాధులకు,

వ్యవసాయ స్థిరత్వానికి అతిపెద్ద సవాలుగా మారాయని ఆర్‌వైఎస్‌ఎస్ కార్యనిర్వాహక ఉపాధ్యక్షులు శ్రీ టి. విజయ్ కుమార్ పేర్కొన్నారు. సహజ వ్యవసాయం, పర్యావరణ అనుకూల వ్యవసాయ విధానాలను విస్తరించేందుకు మహిళా ఆధ్వర్యంలోని స్వయం సహాయక సంఘాలను సమీకరిస్తూ, వాతావరణ అనుకూల వ్యవసాయానికి నాయకత్వం వహించాలని ఏపీమాస్‌కు పిలుపునిచ్చారు.

ర్యాస్ అనుభవాన్ని ఉదాహరణగా ప్రస్తావిస్తూ, గ్రామీణ ప్రాంతాల్లో సహజ వ్యవసాయాన్ని విస్తరించడంలో మహిళా సంఘాలు కీలక పాత్ర పోషించాయని చెప్పారు. వరద ప్రభావిత ప్రాంతాల అనుభవాలను ఉదహరిస్తూ, సహజ వ్యవసాయం పంటల నిలకడను పెంచి, వాతావరణ మార్పుల ప్రభావాన్ని ఎదుర్కొనే రైతుల సామర్థ్యాన్ని బలోపేతం చేస్తుందని వివరించారు. గ్రామీణ పరివర్తనలో మహిళలే కేంద్రబిందువుగా కొనసాగాలని, వారి సామూహిక నాయకత్వమే సహజ వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి విజయానికి మూలకారణమని పేర్కొన్నారు.

**రుణాలు కాదు, జీవనోపాధులు ముఖ్యం:శ్రీ రెడ్డి సుబ్రహ్మణ్యం**

గత ఇరవై ఐదు సంవత్సరాలుగా సంస్థాగత నిర్మాణంపై ఏపీమాస్ చూపిన నిబద్ధతను క్రిస్ప్ వ్యవస్థాపక సీఈఓ శ్రీ రెడ్డి సుబ్రహ్మణ్యం ప్రశంసించారు. అనేక అభివృద్ధి సంస్థలు కాలక్రమేణా గ్రామీణ స్థాయి పనులకు దూరమవుతుండగా, ఏపీమాస్ మాత్రం సమాజ సంస్థల బలోపేతానికే అంకిత భావంతో పని చేస్తోందని అన్నారు.

అభివృద్ధి తదుపరి దశలో కేవలం రుణాల లభ్యతపై కాకుండా, సమాజ సంస్థల ద్వారా స్థిరమైన జీవనోపాధి అవకాశాల సృష్టిపై దృష్టి పెట్టాలని సూచించారు. ఎస్‌హెచ్‌జిలు, గ్రామ పంచాయతీల మధ్య సమన్వయాన్ని పెంపొందించి, గ్రామ ప్రజల అవసరాలు గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికల్లో ప్రతిబింబించేలా చూడాలని సూచించారు. ఎస్‌హెచ్‌జిల అభివృద్ధి సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు (ఎస్ డి జీ లు) సాధనకు, ముఖ్యంగా పేదరిక నిర్మూలన, సామాజిక సమానత్వం, లింగ సమానత్వానికి దోహదపడాలని పేర్కొన్నారు. మహిళలపై హింస వంటి సామాజిక సమస్యలను పరిష్కరించడంలో కూడా సమాజ సంస్థలు కీలక వేదికలుగా మారాలని అభిప్రాయపడ్డారు

**పి 4 బలపడాలి : శ్రీ అల్ ఫెర్నాండెజ్**

భారతదేశ స్వయం సహాయక సంఘాల ఉద్యమ పరిణామాన్ని, ఏపీమాస్ ఆవిర్భావానికి దోహదపడిన తత్వాన్ని మైరాడ సభ్య కార్యదర్శి శ్రీ అల్ ఫెర్నాండెజ్ వివరించారు. ఏపీమాస్ ఒక్కరోజులో ఏర్పడలేదని, దశాబ్దాల పాటు సాగిన అనుభవాలు, ప్రయోగాలు, అభివృద్ధి రంగ నిపుణుల సామూహిక కృషి ఫలితమేనని పేర్కొన్నారు. గ్రామీణాభివృద్ధిలో సమాజాలే నాయకత్వం వహించా లని, బయటి సంస్థలు కేవలం సౌకర్య కల్పించే పాత్రను మాత్రమే పోషించాలని ఆయన సూచించారు. ప్రజలు కేంద్రంగా ఉండేప్రభుత్వ–ప్రైవేటు–ప్రజల భాగస్వామ్యాలు (పబ్లిక్–ప్రైవేట్–పీపుల్ పార్టనర్‌షిప్స్) మరింత బలోపేతం కావాలని అభిప్రాయపడ్డారు. సుస్థిర వ్యవసాయం, నేల – నీటి సంరక్షణ, పశు సంవర్ధక అభివృద్ధి, గ్రామీణ సమాజ యాజమాన్యంలోని సంస్థలలో పెట్టుబడులను పెంచాలని సూచిస్తూ, ప్రజలే తమ అభివృద్ధికి నాయకులుగా మారినప్పుడే సమగ్ర, సుస్థిర అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు.

**వందన సమర్పణ : శ్రీమతి రామలక్ష్మి**

సదస్సు ముగింపు సందర్భంగా ఏపిమాస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్రీమతి రామలక్ష్మి కృతజ్ఞతలు తెలిపారు. రజతోత్సవ వేడుకలు, జాతీయ సదస్సు విజయవంతంగా నిర్వహించేందుకు సహకరించిన తెలంగాణ రాష్ట్ర గవర్నర్, విశిష్ట అతిథులు, ముఖ్య వక్తలు, ప్యానెల్ సభ్యులు, ప్రభుత్వాధికారులు, అభివృద్ధి భాగస్వామ్య సంస్థలు, విద్యా పరిశోధనా సంస్థలు, దాతృత్వ సంస్థలు, పౌరసమాజ సంస్థలు, బ్యాంకింగ్ ప్రతినిధులు, స్వయంసహాయక సంఘాల, సమాఖ్యల, ఎఫ్‌పిఓల (రైతు ఉత్పత్తిదారులసంస్థల)ప్రతినిధులు, సదస్సులో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ ఆమె హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

రెండు రోజులపాటు జరిగిన ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించడంలో కృషి చేసిన నిర్వహణ బృందం, స్వచ్ఛంద సేవకులు, భాగస్వామ్య సంస్థలను ఆమె ప్రత్యేకంగా అభినందించారు. సదస్సులో జరిగిన విస్తృత చర్చలు,

ఆలోచనాత్మక సంభాషణలు, అనుభవాలను పంచుకోవడం ద్వారా సమాజ ఆధారిత అభివృద్ధిని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు విలువైన సూచనలు, ఆచరణాత్మక సిఫార్సులు వెలువడినందుకు ఆమె సంతోషం వ్యక్తం చేశారు.

సదస్సులో వచ్చిన సిఫార్సులను కార్యరూపంలోకి తీసుకువెళ్లేందుకు ఏపిమాస్ తన నిబద్ధతను పునరుద్ఘాటిస్తూ, సమాజ సంస్థల బలోపేతం, సమ్మిళిత జీవనోపాధుల ప్రోత్సాహం, సుస్థిర వ్యవసాయ అభివృద్ధి, భాగస్వామ్య సహకారాన్ని మరింత విస్తరించడం ద్వారా స్థిరమైన, స్వావలంబనతో కూడిన, సమృద్ధి చెందిన సమాజాల నిర్మాణానికి కృషి కొనసాగిస్తామని పేర్కొన్నారు. ఈ సమావేశం సమ్మిళిత, సుస్థిర, సమాజ ఆధారిత అభివృద్ధి దిశగా నిరంతర ప్రయాణాన్ని కొనసాగించాలనే నూతన సంకల్పంతో విజయవంతంగా ముగిసింది.

**నాట్య, సంగీత విభావరి**

ఏపీమాస్ రజతోత్సవాల తొలి రోజు కార్యక్రమాలకు సాంస్కృతిక సాయంత్రం వైభవోపేత ముగింపుగా నిలిచింది. ఈ కార్యక్రమం ద్వారా ప్రతినిధులు, విశిష్ట అతిథులు, అభివృద్ధి రంగ నిపుణులు భారతీయ సాంస్కృతిక వైభవాన్ని ఆస్వాదించడంతో పాటు పరస్పర స్నేహసౌహార్దాలను మరింత బలోపేతం చేసుకునే అవకాశం లభించింది. కార్యక్రమానికి కళాక్షేత్ర బృందం అందించిన మనోహరమైన కూచిపూడి నృత్య ప్రదర్శనతో శ్రీకారం చుట్టారు.

కళాకారులు తమ లాలిత్యభరితమైన నృత్య విన్యాసాలు, భావాభినయం, ఆకర్షణీయమైన ప్రదర్శన ద్వారా భారతీయ శాస్త్రీయ నృత్య సంప్రదాయంలోని సౌందర్యాన్ని, సాంస్కృతిక వైభవాన్ని అద్భుతంగా ఆవిష్కరించి ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశారు. అనంతరంలిటిల్ మ్యూజిషియన్స్ అకాడమీ కళాకారులు అందించిన మధురమైన సంగీత విభావరి సభికులను విశేషంగా అలరించింది. ప్రజాదరణ పొందిన గీతాలు, స్ఫూర్తిదాయకమైన పాటలను హృద్యంగా ఆలపిస్తూ ఉత్సాహభరితమైన, ఆనందోత్సాహాలతో నిండిన వాతావరణాన్ని సృష్టించారు. వారి సంగీత ప్రదర్శనకు సభికుల నుంచి ఘనమైన ప్రశంసలు లభించాయి. ■

## విధాన సిఫార్సులు

- సమాజ సంస్థల బలోపేతం, ఆవిష్కరణలు, ఆధారిత విధాన రూపకల్పనకు మద్దతు అందించే జాతీయ స్థాయి అత్యుత్తమ కేంద్రంగా ఏపీమాస్‌ను అభివృద్ధి చేయాలి.
- కేవలం రుణాలపై దృష్టి కేంద్రీకరించడం కాకుండా, స్థిరమైన జీవనోపాధులు, సంస్థాపకత, ఆదాయ వృద్ధిపై సమాజ సంస్థలు దృష్టి పెట్టాలి.
- మహిళా ఆధ్వర్యంలోని సమాజ సంస్థల ద్వారా వాతావరణ అనుకూల వ్యవసాయం, సహజ వ్యవసాయం, నీటి సంరక్షణ, పర్యావరణ పునరుద్ధరణను ప్రోత్సహించాలి.
- రైతు ఉత్పత్తిదారుల సంస్థల్లో వృత్తిపరమైన నిర్వహణ, వ్యాపార ప్రణాళిక, సమీకరణ వ్యవస్థలు, విలువ ఆధారిత ఉత్పత్తులు, మార్కెట్ అనుసంధానాన్ని బలోపేతం చేయాలి.
- సమాజ సమీకరణ, సంస్థాగత సామర్థ్యాభివృద్ధి, నాయకత్వ వికాసంలో నిరంతర పెట్టుబడుల ద్వారా భవిష్యత్ గ్రామీణ నాయకులను తీర్చిదిద్దాలి.
- ఎస్‌హెచ్‌జిలు, ఎఫ్‌పిఓలు, గ్రామ పంచాయతీల మధ్య సమన్వయాన్ని పెంచి, గ్రామ ప్రజల అవసరాలు స్థానిక అభివృద్ధి ప్రణాళికల్లో ప్రతిబింబించేలా చూడాలి.
- సమాజ సంస్థల అభివృద్ధి సుస్థిర అభివృద్ధి లక్ష్యాలైన పేదరిక నిర్మూలన, లింగ సమానత్వం, సామాజిక సమగ్రత, పర్యావరణ స్థిరత్వానికి ప్రత్యక్షంగా దోహదపడేలా చర్యలు తీసుకోవాలి.
- పశుసంవర్ధక రంగం, అనుబంధ వ్యవసాయ రంగాలు, స్థానిక విలువ గొలుసులు వంటి విభిన్న జీవనోపాధి అవకాశాలను అభివృద్ధి చేస్తూ, సమాజ యాజమాన్యంలోని గ్రామీణ సంస్థలను ప్రోత్సహించాలి.
- ఆర్థిక సాధికారతతో పాటు సామాజిక రక్షణ, మహిళలపై హింస, సామాజిక వివక్ష వంటి సమస్యలను కూడా అభివృద్ధి కార్యక్రమాల్లో భాగం చేయాలి. ■

**ఆలోచనలు మారవచ్చు కాని సిద్ధాంతం కాదు, ఆకులు రాలవచ్చు కాని మూలం నశించకూడదు**

# విశ్వాసానికి, జీవన నవ చైతన్యానికి ప్రతీక ఏపిమాస్: గవర్నర్



ఏపిమాస్ రజతోత్సవాలను ప్రారంభించి, ప్రధానోపన్యాసం చేసిన ముఖ్య అతిథి, తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శ్రీశివ ప్రతాప్ శుక్లా 'సమాజ ఆధారిత అభివృద్ధి, మహిళా సాధికారత, పేదరిక నిర్మూలన' రంగాలలో ఇరవై ఐదు సంవత్సరాలుగా అంకితభావంతో సేవలందిస్తూ విశిష్ట ప్రస్థానాన్ని కొనసాగిస్తున్న ఏపిమాస్ సంస్థకు హృదయ పూర్వక అభినందనలు తెలియజేశారు.

ఈ రజతోత్సవాన్ని "సాధించిన విశ్వాసానికి, నిర్మించిన సంస్థలకు, రూపాంతరం చెందిన జీవితాలకు ప్రతీక"గా అభివర్ణిస్తూ, గ్రామీణ సమాజ సాధికారతకు పునాది అయిన అట్టడుగు స్థాయి ప్రజా సంస్థలను బలోపేతం చేయడంలో ఏపిమాస్ కనబరుస్తున్న నిబద్ధతను ఆయన కొనియాడారు. స్వయం సహాయక సంఘాలను (ఎస్‌హెచ్‌జిలు), వాటి సమాఖ్యలను, రైతు ఉత్పత్తిదారుల సంస్థలను (ఎఫ్‌పిఓలు), ఇతర సమాజ ఆధారిత సంస్థలను బలోపేతం చేయడంలో ఏపిమాస్ పోషించిన మార్గదర్శక పాత్రను గవర్నర్ ప్రత్యేకంగా కొనియాడారు. మహిళలు, చిన్న రైతులు, సామాజికంగా వెనుకబడిన వర్గాల సాధికారతకు ఈ సంస్థ అందించిన విశిష్ట సేవలను ఆయన ప్రశంసించారు.

తెలంగాణ రాష్ట్రంలో స్వయం సహాయ సంఘాల ఉద్యమం సాధించిన విస్తృత విజయాలను ప్రస్తావిస్తూ, ఆరు లక్షలకు పైగా స్వయం సహాయ సంఘాలు, ఇరవై మూడు వేలకుపైగా సమాఖ్యలు, దాదాపు అరవై ఏడు లక్షల మహిళా సభ్యులను సాధికారులుగా తీర్చిదిద్దడంలో ఈ ఉద్యమం కీలక పాత్ర పోషించిందని పేర్కొన్నారు. మహిళల ఆర్థిక స్వావలంబనకు, ఆర్థిక సమ్మిళితత్వానికి ఆదర్శంగా నిలిచిన 'స్త్రీనిధి' వంటి సమాజ యాజమాన్య సంస్థలను ఆయన విశేషంగా అభినందించారు.

సుస్థిరమైన, సమ్మిళిత అభివృద్ధి సాధనకు బలమైన ప్రజా సంస్థలే మూలాధారమని గవర్నర్ స్పష్టం చేశారు. సమగ్రాభివృద్ధిని ప్రభుత్వాలు మాత్రమే సాధించలేవని, ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు, ఆర్థిక సంస్థలు, విద్యా, పరిశోధనా సంస్థలు, సమాజ ఆధారిత సంస్థలు పరస్పర భాగస్వామ్యంతో పని చేసినప్పుడే అభివృద్ధి ఫలాలు అత్యంత వెనుకబడిన వర్గాలకు చేరతాయని ఆయన పేర్కొన్నారు.

**'తెలంగాణ రైజింగ్-2047' విజన్‌ను ప్రస్తావిస్తూ,** మహిళా సాధికారత, రైతు సంస్థల బలోపేతం, గ్రామీణ జీవనోపాధుల స్థిరీకరణ ద్వారా సమ్మిళిత, సుస్థిర, ప్రపంచ స్థాయి పోటీతత్వం కలిగిన ఆర్థిక వ్యవస్థను నిర్మించాల్సిన అవసరాన్ని గవర్నర్ నొక్కి చెప్పారు. రైతు ఉత్పత్తిదారుల సంస్థల ప్రోత్సాహం, విలువపెంపు, మార్కెట్ అనుసంధానం, ప్రకృతి వ్యవసాయం, జలసంరక్షణ, వాతావరణ మార్పులకు తట్టుకునే వ్యవసాయ విధానాల ప్రాధాన్యాన్ని ఆయన విశదీకరించారు. ఇవే భవిష్యత్తు వ్యవసాయాభివృద్ధికి, రైతుల ఆదాయవృద్ధికి, వాతావరణ మార్పుల సవాళ్లను సమర్థంగా ఎదుర్కొనడానికి సరైన మార్గాలని ఆయన అన్నారు.

ఏపిమాస్ ఇరవై ఐదు సంవత్సరాల విశిష్ట ప్రస్థానాన్ని అభినందిస్తూ, భవిష్యత్తులో కూడా సమ్మిళిత అభివృద్ధి, సామాజిక న్యాయం, సుస్థిర ప్రగతికి ఈ సంస్థ మరింత కీలక పాత్ర పోషిస్తుందనే విశ్వాసాన్ని గవర్నర్ వ్యక్తం చేశారు.

ప్రతి మహిళ సాధికారిణిగా, ప్రతి రైతు సుసంపన్నుడిగా, ప్రతి గ్రామం సుస్థిర అభివృద్ధికి ప్రతీకగా, ప్రతి పౌరుడు గౌరవప్రదమైన, భద్రమైన, ఆశావహమైన జీవితం గడిపే సమాజ నిర్మాణం కోసం అన్ని వర్గాలూ సమిష్టిగా కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

■

నీలో మార్పు రాకుండా ఇతరులలో మార్పు రావాలనుకోవడం అత్యాశ

# సమ్మిళిత సమాజం లక్ష్యంగా 'తెలంగాణ రైజింగ్ విజన్-2047'

ఏపిమాస్ రజతోత్సవాల సందర్భంగా నిర్వహించిన రెండు రోజుల సమ్మేళనంలో రెండవ రోజున, తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శ్రీజయేశ్ రంజన్ "తెలంగాణ రైజింగ్ విజన్–2047" అనే అంశంపై ప్రత్యేక ప్రసంగం చేస్తూ, సమ్మిళిత, సుస్థిర, ప్రపంచస్థాయి పోటీతత్వం కలిగిన తెలంగాణ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన దీర్ఘకాలిక అభివృద్ధి కార్యాచరణను వివరించారు. భారత స్వాతంత్ర్య శతాబ్ది సంవత్సరం అయిన 2047 ప్రాధాన్యాన్ని ప్రస్తావిస్తూ, గౌరవ ప్రధానమంత్రి ప్రతిపాదించిన "వికసిత్ భారత్–2047" లక్ష్యాన్ని ఆయన గుర్తు చేశారు. ఈ లక్ష్యానికి అనుగుణంగా భారత్‌ను 30 ట్రిలియన్ అమెరికన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడంతో పాటు, తలసరి ఆదాయాన్ని సుమారు 2,600 అమెరికన్ డాలర్ల నుండి 18,000 అమెరికన్ డాలర్లకు పెంచే దిశగా దేశం కృషి చేస్తోందని తెలిపారు. ఈ జాతీయ దార్శనికతకు అనుగుణంగా ప్రతి రాష్ట్రం తన స్వంత విజన్ పత్రాన్ని రూపొందించాలని నీతి ఆయోగ్ సూచించినట్లు పేర్కొన్నారు.

తెలంగాణ ప్రభుత్వం రూపొందించిన "తెలంగాణ విజన్–2047" రాష్ట్ర ఆర్థిక, సామాజిక పరివర్తనకు రాబోయే రెండు దశాబ్దాల వ్యూహాత్మక మార్గదర్శకంగా నిలుస్తుందని ఆయన వివరించారు. ఈ విజన్‌లో సంప్రదాయ వృద్ధి రంగాలతో పాటు పర్యాటకం, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు (ఎంఎస్ఎంఈలు), నైట్–టైమ్ ఎకానమీ, లేక్ ఎకానమీ వంటి అభివృద్ధి చెందుతున్న రంగాలకు ప్రాధాన్యం కల్పించడం ద్వారా ఉపాధి అవకాశాలను విస్తరించడం, పెట్టుబడులను ఆకర్షించడం, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు.

ఆర్థికాభివృద్ధి మాత్రమే కాకుండా, సమ్మిళిత సామాజిక అభివృద్ధి కూడా సమానంగా ముఖ్యమని ఈ విజన్ స్పష్టం చేస్తోందని ఆయన పేర్కొన్నారు. అందుకు అనుగుణంగా విద్య, ఆరోగ్యం, పోషకాహారం, జీవనోపాధి, నైపుణ్యాభివృద్ధి రంగాలకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు, యువతను రాష్ట్ర భవిష్యత్ అభివృద్ధికి ప్రధాన చోదకశక్తిగా తీర్చిదిద్దే దిశగా కార్యాచరణ రూపొందించబడిందని తెలిపారు. అదేవిధంగా, వాతావరణ మార్పుల సవాళ్లను ఎదుర్కొంటూ నెట్–జీరో రాష్ట్రంగా తెలంగాణను అభివృద్ధి చేయాలనే లక్ష్యాన్ని కూడా విజన్‌లో పొందుపరిచినట్లు వివరించారు.

వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేయడం ఈ విజన్‌లో ప్రధాన ప్రాధాన్యాంశంగా నిలిచిందని పేర్కొంటూ, ఉత్పాదకత పెంపు, విలువ ఆధారిత ఉత్పత్తులు, మెరుగైన మార్కెట్ అనుసంధానం, సంస్థాగత మద్దతు ద్వారా రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయడం లక్ష్యమని వివరించారు. ఈ క్రమంలో రైతు ఉత్పత్తిదారుల సంస్థలు (ఎఫ్‌పీఓలు) వ్యవసాయ విలువ గొలుసులను బలోపేతం చేయడంలో, రైతుల పోటీతత్వాన్ని పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని ఆయన పేర్కొన్నారు.

మహిళల ఆర్థిక సాధికారతకు కూడా విజన్–2047లో అత్యంత ప్రాధాన్యం కల్పించబడిందని, ఒక కోటి మంది మహిళల జీవితాల్లో సానుకూల మార్పు తీసుకురావడం లక్ష్యంగా వ్యవస్థాపకతను ప్రోత్సహించడం, సామూహిక వ్యాపార సంస్థలను అభివృద్ధి చేయడం, కమ్యూనిటీ ఆధారిత సంస్థలను మరింత బలోపేతం చేయడం వంటి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు.

"తెలంగాణ రైజింగ్ విజన్–2047"విజయవంతం కావాలంటే ప్రభుత్వం, కమ్యూనిటీ సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రైవేట్ రంగ భాగస్వాములు, ప్రజలు సమిష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఉందని ఆయన పిలుపునిచ్చారు. ఈ విజన్ సమృద్ధి, సమ్మిళిత అభివృద్ధి, పర్యావరణ సుస్థిరత, విపత్తులను తట్టుకునే సామర్థ్యం కలిగిన తెలంగాణ నిర్మాణానికి సమగ్ర మార్గదర్శకంగా నిలిచి, "వికసిత్ భారత్–2047" జాతీయ లక్ష్య సాధనకు రాష్ట్రం విశిష్టమైన తోడ్పాటు అందిస్తుందని ఆయన పేర్కొన్నారు. ■

అధికారం, ధనం జీవన ఫలాలు ; కుటుంబం, మిత్రులు జీవన మూలాలు, మూలం లేని ఫలం మరణం!

# విశ్వవ్యాప్త సేవాస్ఫూర్తి డాక్టర్ పమిడి కోటయ్య!

– పాలాది మోహనయ్య

**డా**క్టర్ పమిడి కోటయ్య (1938 మే 31–23 జులై 2026) భారతదేశ బ్యాంకింగ్, గ్రామీణాభివృద్ధి రంగాలలో అత్యున్నత స్థాయిలో సేవలందించిన ప్రముఖ ఆర్థికవేత్త, దూరదృష్టి గల పరిపాలకుడు, సమర్ధ సంస్థాగత నాయకుడు. ఆరు దశాబ్దాలకు పైగా విస్తరించిన ఆయన విశిష్ట సేవా ప్రస్థానం భారత గ్రామీణ ఆర్థికాభివృద్ధి చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుంది.

*__ఆం__ధ్రప్రదేశ్‌లోని ఒక చిన్న పట్టణంలో జన్మించిన రైతు బిడ్డ తెలుగుజాతి ఖ్యాతిని విశ్వవ్యాప్తం చేశారు. అమోఘమైన అంకితభావంతో, అసాధారణమైన కార్యదక్షతతో గ్రామీణాభివృద్ధి, బ్యాంకింగ్, స్వయంసహాయ, ఆర్థిక రంగాలో ఆయన చిరస్మరణీయమైన సేవలను అందించి, జనబాహుళ్యానికి ఎన్నో ప్రయోజనాలు చేకూర్చారు. ఆయనే డాక్టర్ పమిడి కోటయ్య!*

ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం జిల్లా, టంగుటూరు గ్రామంలోని ఒక రైతు కుటుంబంలో 1938 మే 31న జన్మించిన డా. కోటయ్య విద్యాభ్యాసంలో అసాధారణ ప్రతిభను కనబరిచారు. ఆర్థిక శాస్త్రంలో స్నాతకోత్తర పట్టాను ప్రథమ శ్రేణిలో, బంగారు పతకంతో సాధించారు. అనంతరం ఆంధ్ర విశ్వవిద్యాలయం ఆయనకు డాక్టర్ ఆఫ్ లెటర్స్ (డి.లిట్.) గౌరవ డిగ్రీని ప్రదానం చేసింది. భారతీయ బ్యాంకర్ల సంస్థ (ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బ్యాంకర్స్)లో అసోసియేట్ అర్హతను పొందిన ఆయనకు, బ్యాంకింగ్, ఆర్థిక రంగాలకు చేసిన విశిష్ట సేవలకు గుర్తింపుగా 'ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్' (ఐఐబిఎఫ్) గౌరవ ఫెలోషిప్‌ను ప్రదానం చేసింది.



1961లో 'భారతీయ రిజర్వు బ్యాంకు' (ఆర్‌బీఐ)లో తన ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించిన ఆయన, 1982లో 'జాతీయ వ్యవసాయ , గ్రామీణాభివృద్ధి బ్యాంకు' (నాబార్డ్)లో చేరారు. నాబార్డ్‌లో 1990–1992 మధ్య మేనేజింగ్ డైరెక్టర్‌గా, 1992–1998 మధ్య ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్‌గా బాధ్యతలు నిర్వహిస్తూ గ్రామీణ పరపతి, వ్యవసాయాభివృద్ధి, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి అపూర్వ నాయకత్వాన్ని అందించారు. ఆయన నాయకత్వంలో నాబార్డ్ దేశ గ్రామీణాభివృద్ధిలో కీలకమైన మైలురాళ్లను అధిగమించింది.

దేశీయ సేవలతో పాటు అంతర్జాతీయ అభివృద్ధి రంగంలోనూ డా. కోటయ్య విశేష కృషి చేశారు. 1980 నుంచి 2010 వరకు ప్రపంచ బ్యాంకు (వరల్డ్ బ్యాంక్), ఐక్యరాజ్యసమితి ఆహార , వ్యవసాయ సంస్థ (ఎఫ్ ఎ ఓ), అంతర్జాతీయ వ్యవసాయాభివృద్ధి నిధి (ఐ ఎఫ్ ఎ డి), ఐక్యరాజ్య సమితి అభివృద్ధి కార్యక్రమం (యుఎన్‌డిపి) వంటి ప్రతిష్ఠాత్మక అంతర్జాతీయ సంస్థలకు స్వల్పకాలిక సలహాదారుగా సేవలందించారు. ఈ బాధ్యతల సందర్భంగా ఆసియా, ఆఫ్రికా ఖండాలకు చెందిన దాదాపు ఇరవై దేశాలకు వ్యవసాయ పరపతి, గ్రామీణాభి వృద్ధి, సంస్థాగత బలోపేతం, విధాన రూపకల్పన వంటి రంగాలలో సేవలందించారు. రోమ్‌లోని ఎఫ్ ఎ ఓ, ఐ ఎఫ్ ఎ డి ప్రధాన కార్యాలయాలలో, అమెరికా రాజధాని వాషింగ్టన్ డి.సి.లోని ప్రపంచ బ్యాంకు ప్రధాన కార్యాలయంలో కూడా పని చేసి, అంతర్జాతీయ అభివృద్ధి విధానాలపై విశేష అనుభవాన్ని సంపాదించారు.

డా. కోటయ్య అటు ప్రభుత్వ, ప్రభుత్వ రంగసంస్థలతో పాటు, ఇటు ప్రైవేటు రంగ సంస్థలలో కూడా అనేక కీలక బాధ్యతలను నిర్వహించారు. భారత ప్రభుత్వం ఏర్పాటు చేసిన 'బ్యాంక్ ఛైర్మన్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ల ఎంపిక మండలి' సభ్యునిగా (2000–2004), 'బ్యాంక్ ఆఫ్ ఇండియా' డైరెక్టర్‌గా (2005–2007), 'బ్యాంకర్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్

రూరల్ డెవలప్‌మెంట్' ఛైర్మన్‌గా (1990-1998) సేవలందించారు.

అదేవిధంగా 'స్మాల్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా' (ఎస్ ఐ డి బి ఐ - సిడ్బి), 'అగ్రికల్చరల్ ఫైనాన్స్ కార్పొరేషన్' (ఎ ఎఫ్ సి), 'నేషనల్ కో ఆపరేటివ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్' (ఎన్ సి డి సి), 'గ్లోబల్ ట్రస్ట్ బ్యాంక్' బోర్డులలో డైరెక్టర్‌గా వ్యవహరించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ 'సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్' పాలక మండలి సభ్యునిగా కూడా ఆయన విశేష సేవలందించారు.

అంతర్జాతీయ స్థాయిలో 'వరల్డ్ అసెంబ్లీ ఆఫ్ స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్' పరిధిలోని 'ఇంటర్నేషనల్ కమిటీ ఆన్ రూరల్ ఇండస్ట్రియలైజేషన్' ఛైర్మన్‌గా, 'ఆసియా-పసిఫిక్ రీజియనల్ అగ్రికల్చరల్ క్రెడిట్ అసోసియేషన్' (ఎ పి ఆర్ ఎ సి ఎ) ఉపాధ్యక్షునిగా, కార్యవర్గ సభ్యునిగా వ్యవహరిస్తూ గ్రామీణ పరపతి, వ్యవసాయాభి వృద్ధి, గ్రామీణ పరిశ్రమల ప్రోత్సాహానికి ఎనలేని కృషి చేశారు.

నాబార్డ్ నుంచి పదవీ విరమణ అనంతరం కూడా రెండు దశాబ్దాలకు పైగా 'ఏపిమాస్'తో సహా అనేక ప్రముఖ ప్రభుత్వేతర , ప్రభుత్వ సంస్థలలో బోర్డు ఛైర్మన్‌గా, స్వతంత్ర నిర్దేశకునిగా (ఇండిపెండెంట్ డైరక్టర్), సేవలందిస్తూ కార్పొరేట్ పాలన, పారదర్శకత, నైతిక విలువల పరిరక్షణలో విశేషపాత్ర పోషించారు.

భారతదేశంతో పాటు ప్రపంచంలోని నలభైకి పైగా దేశాలలో పని చేసిన అనుభవం ఆయనకు ఉంది. బ్యాంకింగ్, వ్యవసాయ పరపతి, గ్రామీణాభివృద్ధి, సంస్థాగత నిర్మాణం, కార్పొరేట్ పాలన, ప్రజా విధానాల రూపకల్పన వంటి విభిన్న రంగాలలో ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమైనవి.

డా. పమిడి కోటయ్య తన అపార మేధస్సు, దూరదృష్టి, నిష్కళంక నిజాయితీ, ప్రజాసేవ పట్ల అంకితభావంతో భారత గ్రామీణాభివృద్ధి రంగంపై చెరగని ముద్ర వేశారు. భారతదేశ గ్రామీణాభివృద్ధి చరిత్రలో ఆయన పేరు చిరస్థాయిగా నిలిచి ఉంటుంది. ■

## ఏపిమాస్ రజతోత్సవ జాతీయ సదస్సు ప్రధాన ఫలితాలు

- స్వయం సహాయక సంఘాల బలోపేతంతో ప్రారంభమైన ఏపీమాస్ ప్రయాణం నేడు ఎస్‌హెచ్‌జిలు, ఎస్‌హెచ్‌జి సమాఖ్యలు, రైతు ఉత్పత్తిదారుల సంస్థలు, సమాజ సంస్థలకు జాతీయ స్థాయిలో మద్దతు అందించే ప్రముఖ సంస్థగా ఎదిగినందుకు గుర్తింపు లభించింది.
- సమగ్ర, సుస్థిర గ్రామీణాభివృద్ధికి సంస్థాగత నిర్మాణం, సమాజ యాజమాన్యమే కేంద్ర బిందువని పునరుద్ఘాటించారు.
- రైతు ఉత్పత్తిదారుల సంస్థలను వృత్తిపరమైన, వ్యాపార ఆధారిత సంస్థలుగా తీర్చిదిద్దుతూ సమీకరణ, విలువ ఆధారిత ఉత్పత్తులు, మార్కెట్ అనుసంధానాన్ని బలోపేతం చేయాల్సిన అవసరాన్ని గుర్తించారు.
- జీవనోపాధులు, వ్యవస్థాపకత, సహజ వ్యవసాయం, వాతావరణానుకూలతను ప్రోత్సహించడంలో మహిళా ఆధ్వర్యంలోని సమాజ సంస్థల కీలకపాత్రను నొక్కిచెప్పారు.
- వాతావరణ మార్పులను ప్రధాన సవాలుగా గుర్తిస్తూ, వాతావరణ అనుకూల వ్యవసాయం, సహజ వనరుల నిర్వహణలో పెట్టుబడులను పెంచాలని సూచించారు.
- గత ఇరవై ఐదు సంవత్సరాల్లో అభివృద్ధి రంగ నిపుణులు, సమాజ నాయకులను తీర్చిదిద్దిన జ్ఞాన, సామర్థ్యాభివృద్ధి సంస్థగా ఏపీమాస్ పాత్రను గుర్తించారు.
- ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు, ఆర్థిక సంస్థలు, సమాజ సంస్థల మధ్య భాగస్వామ్యాలను బలోపేతం చేయాల్సిన అవసరాన్ని నొక్కిచెప్పారు.
- పశుసంవర్ధక రంగం, అనుబంధ వ్యవసాయ రంగాలు, స్థానిక విలువ గొలుసుల వంటి విభిన్న జీవనోపాధి అవకాశాలను అభివృద్ధి చేస్తూ, సమాజ యాజమాన్యంలోని గ్రామీణ సంస్థలను ప్రోత్సహించాలని గుర్తించారు. ■

ధనముంటే ధనవంతుడు అంటారు, ఆ ధనంతో ఇతరుల కష్టాలు తీరిస్తే భగవంతుడు అంటారు

# విలువలే పునాదిగా ఏపిమాస్‌కు డాక్టర్ కోటయ్య నాయకత్వం!

– ఎస్ రామలక్ష్మి

**1998**వ సంవత్సరంలో ఏపిమాస్ ఆవిర్భావ భావనను రూపుదిద్దేందుకు ఒక సలహా సంఘాన్ని ఏర్పాటు చేశారు. ఈ సంఘానికి నాబార్డ్ మాజీ ఛైర్మన్ డా. పమిడి కోటయ్యగారు అధ్యక్షత వహించారు. ఆయన అనేక సంప్రదింపుల సమావేశాల్లో పాల్గొని, సంస్థ ఆవిర్భావానికి దూర దృష్టితో కూడిన మార్గనిర్దేశం అందించారు. 1998 నుండి 2001 మధ్యకాలంలో ఏపిడబ్ల్యూఎఫ్ నుండి ఏపి మ్యాట్, అనంతరం ఏపిమాస్‌గా సంస్థ రూపకల్పన పరిణామ ప్రక్రియలో ఆయన కీలక పాత్ర పోషించారు. అనంతరం కోటయ్యగారు ఏపిమాస్ వ్యవస్థాపక ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించి, సంస్థ ప్రారంభ దశలో సమర్థ నాయకత్వాన్ని అందించారు.

2001 జూన్ నుండి 2007 సెప్టెంబర్ వరకు దాదాపు ఆరు సంవత్సరాలపాటు ఆయన ఏపిమాస్ ఛైర్మన్‌గా సేవలందించారు. ఈ కాలంలో ఆయన బోర్డు సమావేశాలను సమర్థవంతంగా నిర్వహిస్తూ, భాగస్వామ్య నిర్ణయ ప్రక్రియకు ప్రాధాన్యత ఇచ్చారు. ముఖ్యంగా బోర్డులో మహిళలకు తగిన ప్రాతినిధ్యం కల్పించాలనే అంశంపై ప్రత్యేక శ్రద్ధ చూపారు.

వ్యవస్థాపక ఛైర్మన్‌గా మహిళా సాధికారతను స్వయం సహాయక సంఘాల (ఎస్ హెచ్ జిల) ద్వారా బలోపేతం చేయాలనే ఏపిమాస్ లక్ష్యానికి ఆయన దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు కేవలం రుణాల పంపిణీకే పరిమితం కాకుండా, గ్రామీణస్థాయిలో సంస్థల బలోపేతంపై దృష్టి సారించాలనే భావనకు ఆయన గట్టి మద్దతు తెలిపారు.

సంస్థలు దీర్ఘకాలికంగా స్థిరంగా, స్వావలంబనతో కొనసాగాలంటే సొంత మౌలిక సదుపాయాలు, శాశ్వత నిధి (కార్పస్) అత్యంత అవసరమని ఆయన గాఢంగా విశ్వసించేవారు. అందువల్ల ఏపీమాస్‌కు సొంత కార్యాలయ భవనం ఏర్పాటు చేయడం, కార్పస్ నిధిని నిర్మించడం వంటి అంశాలకు ఆయన ఎంతో ప్రాధాన్యత ఇచ్చారు.

భాగస్వామ్యాలు, పరస్పర సహకార శక్తిపై ఆయనకు అపార విశ్వాసం ఉండేది. ప్రభుత్వాలతో సన్నిహితంగా కలిసి పనిచేస్తూ, గ్రామీణాభివృద్ధి, సామాజిక సాధికారత రంగాల్లో విస్తృత స్థాయి ప్రభావాన్ని సృష్టించేందుకు ఏపిమాస్ కృషి చేయాలని ఆయన నిరంతరం ప్రోత్సహించారు. ఆయన దూరదృష్టి, విలువల ఆధారిత నాయకత్వం, సంస్థాగత నిర్మాణంపై చూపిన శ్రద్ధ ఏపీమాస్ అభివృద్ధికి చిరస్థాయి మార్గదర్శకంగా నిలిచాయి.

డా. పమిడి కోటయ్య గారు ఏపిమాస్ ఛైర్మన్‌గా పని చేసిన కాలం సంస్థ అభివృద్ధిలో అత్యంత కీలకమైన దశగా నిలిచింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో స్వయం సహాయ సంఘాల (ఎస్‌హెచ్‌జి ల) బలోపేతానికి అవసరమైన సంస్థాగత వ్యవస్థలను నెలకొల్పడంలో ఆయన కీలక పాత్ర పోషించారు. ఆయన దూరదృష్టిగల నాయ కత్వం, లోతైన సాంకేతిక పరిజ్ఞానం, విశిష్ట పరిపాలనా అనుభవం, గ్రామీణ మహిళల సాధికారత పట్ల ఉన్న అచంచల నిబద్ధత ఏపిమాస్ ప్రారంభ దశలో సంస్థకు స్పష్టమైన దిశానిర్దేశం అందించాయి. ఆయన అందించిన మార్గదర్శకత్వం, మెంటార్‌షిప్ ఏపిమాస్‌కు బలమైన పునాది వేయడమే కాకుండా, సమాజ ఆధారిత అభివృద్ధి, గ్రామీణ జీవనోపాధుల పురోగతి, మహిళా సాధికారత రంగాల్లో చిరస్థాయిగా నిలిచే వారసత్వాన్ని మిగిల్చాయి.

**సంతాప సందేశాలు**

**శ్రీ సి.ఎస్. రెడ్డి, సీఈఓ, మేనేజింగ్ డైరెక్టర్, ఏపిమాస్:**

డా. కోటయ్యగారు అపూర్వమైన మానవతావాది. భారతదేశంతో పాటు పలు అభివృద్ధి చెందుతున్న దేశాల్లో వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి, సమాజ సాధికారత రంగాలకు ఆయన అందించిన విశేష సేవలు చిరస్మరణీయమైనవి. ఆయన దూరదృష్టి, నిరాడంబరత, గ్రామీణ పేదల అభ్యున్నతికి అంకితభావంతో చేసిన కృషి తరతరాలకు స్ఫూర్తి

దాయకంగా నిలుస్తుంది. ఏపిమాస్ డైరెక్టర్ల బోర్డుతరఫున, ఉద్యోగులందరి తరఫున వారి కుటుంబ సభ్యులకు మా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను. ఈ తీరని విషాదాన్ని తట్టుకునే ధైర్యాన్ని, మనోబలాన్ని శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి ప్రసాదించాలని, ఆయన పవిత్ర ఆత్మకు శాశ్వత శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నాను. ఓం శాంతిః

**శ్రీమతి రామలక్ష్మి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, ఏపిమాస్ :**

డా. పమిడి కోటయ్య గారి మరణవార్త మాకు తీవ్ర విషాదాన్ని కలిగించింది. గ్రామీణాభివృద్ధి రంగానికి, ముఖ్యంగా 'స్వయం సహాయక సంఘాలు–బ్యాంకు అనుసంధాన కార్యక్రమం' అభివృద్ధికి ఆయన అందించిన విశిష్ట సేవలు చిరకాలం స్మరణీయంగా నిలిచిపోతాయి. ఆయన కుటుంబ సభ్యులకు మా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను. ఆయన పవిత్ర ఆత్మకు శాశ్వత శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నాను."

**డా. జి. ఆర్. చింతల, మాజీ ఛైర్మన్, నాబార్డ్ :**

ప్రియమైన నాబార్డియన్స్, మన ప్రియతమ మాజీ ఛైర్మన్ డా. పమిడి కోటయ్య గారు పరమపదించారు. గ్రామీణ భారత అభ్యున్నతికి, సంస్థల నిర్మాణానికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమైనవి. ఆయన పవిత్ర ఆత్మ శ్రీ మహా విష్ణువు పాదపద్మాల చెంత శాశ్వత శాంతిని పొందాలని ప్రార్థిస్తున్నాను.

ఇంకా, శ్రీ రాజన్, శ్రీ వినాయక రెడ్డి, శ్రీమతి రేఖా దేవదాసు, శ్రీమతి శ్రీలక్ష్మి, శ్రీ నవీన్, శ్రీ సిద్ధి శ్రీనివాస్, శ్రీ మస్తాన్, శ్రీ ప్రహ్లాదయ్య, శ్రీ లుగేంద్ర పిళ్లై, శ్రీ తిరుపతయ్య నామాని, శ్రీ ఎం. బి. సుబ్రహ్మణ్యం రెడ్డి, శ్రీ కుమారస్వామి, శ్రీ రాజేంద్ర ప్రసాద్, శ్రీ మురళి జాజున తదితరులు కూడా డా. పమిడి కోటయ్యగారి మరణంపట్ల తమ ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి రంగాలకు ఆయన చేసిన అపూర్వ సేవలను స్మరించుకుంటూ, వారి కుటుంబ సభ్యులకు హృదయపూర్వక సానుభూతిని తెలియజేసి, ఆయన పవిత్ర ఆత్మకు శాశ్వత శాంతి చేకూరాలని ప్రార్థించారు. ■

## ప్రత్యామ్నాయ పంటలే శరణ్యమా?

ఎల్‌నినో కారణంగా ఈ ఏడాది లోటు వర్షపాతం నమోదవుతుందన్న వాతావరణ నిపుణుల హెచ్చరికలతో ఖరీఫ్ పంటల సాగుపై అన్నదాతలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. నైరుతి రుతుపవనాలు ఉత్తరాంధ్రలోకి ప్రవేశించి నెల రోజులు దాటినా.. పట్టిమని పది సెంటీమీటర్ల వర్షం పడలేదు. ముమ్మరంగా దమ్ము పనులు జరగాల్సిన ప్రస్తుత తరుణంలో రైతులు కనీసం దుక్కులు కూడా దున్నలేదు. చెరువులు, ఇతర చిన్నతరహా సాగునీటి వనరుల కింద ఈ ఏడాది వరిసాగుపై ఎల్‌నినో నీడలు కమ్ముకున్నాయి. ఈ నేపథ్యంలో రైతులు వరికి బదులు ప్రత్యామ్నాయపంటలు సాగు చేయాలని శాస్త్రవేత్తలు, వ్యవసాయశాఖ అధికారులు సూచిస్తున్నారు. ఎల్‌నినో పరిస్థితుల అంచనా నేపథ్యంలో ప్రభుత్వం ఇప్పటికే ప్రత్యామ్నాయ పంటల ప్రణాళికలను రూపొందించినప్పటికీ ఈ నెలాఖరు వరకు వేచి చూసి, పరిస్థితి ఆశాజనకంగా లేకపోతే అప్పుడు ప్రణాళికల అమలుపై దృష్టి కేంద్రీకరించాలని శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ అధికారులు భావిస్తున్నారు. ఆగస్టు రెండో వారంలోగా భారీవర్షాలు కురవకపోతే వరికి బదులుగా మినుము,పెసర, కంది వంటి అపరాల పంటలను వేసుకోవాలని సూచిస్తున్నారు. అయితే ఈ పంటలు విత్తిన తరువాత ఒకటి, రెండు భారీ వర్షాలు కురిస్తే మినుము, పెసర పంటలు దెబ్బతినే ప్రమాదం వుందని హెచ్చరిస్తున్నారు. అపరాలే కాకుండా వేరుశనగ, సజ్జ, రాగి, కొర్ర వంటి చిరుధాన్యాల పంటలను కూడా వేసుకుంటే మంచిదని చెబుతున్నారు.

ఎల్‌నినోని దృష్టిలో ఉంచుకొని స్వల్ప, మధ్య కాలిక పంటలు సాగు చేయాలని, వాతావరణ మార్పులను తట్టుకునే పంటలను వేయాలని వ్యవసాయ శాఖ సూచిస్తున్నది. నీటి ఎద్దడి ప్రభావం పంటలపై పడకుండా ఉండేందుకు లోతు దుక్కులు చేసుకోవాలని సేద్య శాస్త్రవేత్త డాక్టర్ కె.వి. రమణమూర్తి సూచిస్తున్నారు. 35 నుంచి 45 సెంటీమీటర్ల లోతున దుక్కి చేయడం వల్ల భూమి లోపల పొరల్లోకి గాలి బాగా ప్రసరించి, తేమ నిల్వ శక్తి పెరుగుతుందని అన్నారు. ■

నీవు ఎవరి మనసైనా నొప్పిస్తే వారి మన్నన కోరు, నిన్నెవరైనా నొప్పిస్తే వారిని మన్నించు

# శత శతమానం భవతి ....!

– జి. శ్రీనివాస రెడ్డి

ఆదివారం జులై ఒకటి, ఏడాది రెండువేల ఒకటి...
పుట్టింది మహిళా అభివృద్ధి సొసైటీ...
ఆదివారం జులై ఒకటి, ఏడాది రెండువేల ఒకటి...
పుట్టింది మహిళా అభివృద్ధి సొసైటీ...

ఆశల దీపమై వెలిగింది...
ఆత్మవిశ్వాసమే నింపింది...
మహిళా శక్తికి మారుపేరై...
ముందుకు సాగింది

స్త్రీ గమ్యం కాకూడదు వంటిల్లు...
తన లక్ష్యం కావాలి గగనపు హరివిల్లు...
అంటూ చకచకా అడుగులు వేసింది...

పొదుపు సంఘాలను చైతన్య పరిచింది...
చేతిలో చేయి కలిపింది...
చీకటిలో వెలుగు నింపింది...
స్వయం సహాయక శక్తిగా...
వేలాది జీవితాలు మార్చింది...

ఆదివారం జులై ఒకటి, ఏడాది రెండువేల ఒకటి...
పుట్టింది మహిళా అభివృద్ధి సొసైటీ...
మహిళా శక్తికి మారుపేరై...
ముందుకు సాగింది సొసైటీ...

అభివృద్ధి అంటే పొదుపు మాత్రమే కాదు చెల్లెమ్మ...
అక్షరాస్యత, అధికారం, ఆరోగ్యం అన్నింటిలో ముందడుగు
వేయాలమ్మా ...
అంటూ ఉరకలు వేసింది...
మహిళా లోకాన్ని ముందుకు నడిపింది...ఆ... ఆ... ఆ...

రైతు రాజు కావాలంటే...
వ్యవసాయం సంఘటితం కావాలని నమ్మింది...
ఎఫ్ పి ఓ లను నెలకొల్పింది...
రైతు రాజు కావాలంటే...
వ్యవసాయం సంఘటితం కావాలని నమ్మింది...
ఎఫ్ పి ఓ లను నెలకొల్పింది...

భూమి సుస్థిరంగా ఉండాలంటే...
సహజసిద్ధ వ్యవసాయమే మార్గమని రైతులకు తెలిపింది...
పర్యావరణహిత మార్గంలో రైతులను నిలిపింది...
భూమి సుస్థిరంగా ఉండాలంటే...
సహజసిద్ధ వ్యవసాయమే మార్గమని రైతులకు తెలిపింది...
పర్యావరణహిత మార్గంలో రైతులను నిలిపింది...

ఏపీమాస్ అంటే సాధికారత అని నిరూపించింది...
అంతర్జాతీయ సంస్థగా ఎదిగింది...
ఏపీమాస్ అంటే సాధికారత అని నిరూపించింది...
అంతర్జాతీయ సంస్థగా ఎదిగింది...

ఇరవై ఐదు వసంతాల రజతోత్సవం జరుపుకుంటుంది...
ఇరవై ఐదు వసంతాల రజతోత్సవం జరుపుకుంటుంది...
ఆదివారం జూలై ఒకటి, ఏడాది రెండువేల ఒకటి...
పుట్టింది మహిళా అభివృద్ధి సొసైటీ...
పుట్టింది మహిళా అభివృద్ధి సొసైటీ...
పుట్టింది మహిళా అభివృద్ధి సొసైటీ...

రజతోత్సవశుభ తరుణాన
శత సహస్ర అభినందనం !
అందుకో ఏపీమాస్ ...
శతమానం భవతి ... శత శతమానం భవతి !

పదిమందిని బాధపెట్టి పైకెదగడం గొప్పకాదు, పదుగురికి తోడ్పడుతూ ఎదగడమే గొప్ప

# 'అభివృద్ధి తీరు మారాలి, సమాజ నాయకత్వంలో సాగాలి'

**అధ్యక్షత :** శ్రీ రాజేష్ టాండన్, వ్యవస్థాపక అధ్యక్షుడు, ప్రియ; ప్యానెల్ సభ్యులు : శ్రీ డబ్ల్యూ.ఆర్. రెడ్డి, ఏపిమాస్ బోర్డు సభ్యుడు, ప్రొఫెసర్ త్రిలోచన్ శాస్త్రి, వ్యవస్థాపకులు, సి సి డి, శ్రీమతి శాంతి కుమారి, డైరెక్టర్ జనరల్, డా. ఎం.సి.ఆర్.హెచ్.ఆర్.డి ఇన్‌స్టిట్యూట్, శ్రీ జిజి మమ్మెన్, సీఈఓ, సా–ధన్.

**చర్చాంశం :**

*'సమ్మిళిత అభి వృద్ధికి సమాజం నాయకత్వం వహించే ప్రగతి మార్గాల పునరాలోచన'*



చర్చా గోష్ఠి-1

గ్రామీణాభివృద్ధి భావనలో చోటు చేసుకుంటున్న పరిణామాలను ఈ తొలి ప్యానెల్ చర్చ సమగ్రంగా విశ్లేషించింది. కార్యక్రమాల ఆధారిత అభివృద్ధి విధానాల నుండి సమాజం స్వయంగా నాయకత్వం వహించే అభివృద్ధి మార్గాల వైపు స్పష్టమైన మార్పు అవసరమని చర్చలో ఏకగ్రీవంగా అభిప్రాయపడ్డారు.

ఈ సమావేశంలో ప్రముఖ విధాన రూపకర్తలు, అభివృద్ధి రంగ నిపుణులు, అనుభవజ్ఞులు పాల్గొని, గత మూడు దశాబ్దాలుగా సమాజ ఆధారిత సంస్థలు సాధించిన పరిణామాలను, భవిష్యత్తులో ఎదురయ్యే సవాళ్లను అధిగమించే మార్గాలను విశ్లేషించారు.

స్వయం సహాయక సంఘాలు (ఎస్‌హెచ్‌జీలు), వాటి సమాఖ్యలు, రైతు ఉత్పత్తిదారుల సంస్థలు (ఎఫ్‌పిఓలు) గత మూడు దశాబ్దాలుగా ఆర్థిక సమ్మిళితత్వం, మహిళా సాధికారత, జీవనోపాధి అభివృద్ధిలో విశేషమైన కృషి చేశాయని ప్యానెల్ సభ్యులు కొనియాడారు. అయితే నేటి పరిస్థితులలో అభివృద్ధి కార్యక్రమాలు కేవలం పేదరిక నిర్మూలన, ఆర్థిక సేవల విస్తరణకు పరిమితం కాకుండా సామాజిక న్యాయం, ప్రజాస్వామ్య భాగస్వామ్యం, జీవనోపాధి భద్రత, పోషకాహార భద్రత, వాతావరణ మార్పులకు తట్టుకునే సామర్థ్యం, జవాబుదారీతనంతో కూడిన స్థానిక పాలన వంటి విస్తృత లక్ష్యాలను సాధించాల్సిన అవసరం ఉందని వారు స్పష్టం చేశారు.

బాహ్య సంస్థలు రూపొందించిన కార్యక్రమాల లబ్ధిదారులుగా కాకుండా, తమ అభివృద్ధికి తామే రూపకర్తలుగా సమాజాలు ఎదిగినప్పుడే స్థిరమైన అభివృద్ధి సాధ్యమవుతుందని ప్యానెల్ సభ్యులు పేర్కొన్నారు. సమర్థవంతమైన ప్రజా సంస్థలు నిరంతర సామర్థ్యాభివృద్ధి, నాయకత్వ వికాసం,సమాజ యాజమాన్య భావన ద్వారా బలోపేతమవుతాయని వివరించారు.

గ్రామీణాభివృద్ధి ముందున్న సవాళ్లను కూడా సమావేశం విశ్లేషించింది. వాతావరణ మార్పుల ప్రభావం, జీవనోపాధి వైవిధ్యీకరణ లోపం, సంస్థాగత సామర్థ్యాభివృద్ధిపై తగ్గుతున్న పెట్టుబడులు, అట్టడుగు వర్గాల వెలివేత, ప్రజాసంస్థలు మరియు పంచాయతీరాజ్ సంస్థల మధ్య తగిన సమన్వయం లేకపోవడం వంటి అంశాలు ప్రధాన ఆందోళనలుగా చర్చించబడ్డాయి. ఈ సవాళ్లను అధిగమించేందుకు ప్రభుత్వాలు, పౌర సమాజ సంస్థలు, ఆర్థిక సంస్థలు, విద్యా సంస్థలు , సమాజ ఆధారిత సంస్థల మధ్య మరింత బలమైన భాగస్వామ్యాలు ఏర్పడి, సమ్మిళిత, సుస్థిర గ్రామీణాభివృద్ధికి అనుకూల వాతా వరణం ఏర్పడాల్సిన అవసరాన్ని ప్యానెల్ నొక్కి చెప్పింది. ■

నీ కంటె ఎంత గొప్పవారితో వున్నావని కాదు, వారు నీకు అండగా నిలిచే వారో కాదో ఆలోచించుకో

# 'స్వయంసహాయంలో స్వయంప్రతిపత్తి పెరగాలి'

**అధ్యక్షురాలు :** డా. సుధా కొఠారి, మేనేజింగ్ ట్రస్టీ, చైతన్య. ప్యానెల్ సభ్యులు: శ్రీ నరేందర్ కాండే, అభివృద్ధి రంగ నిపుణులు, శ్రీ శ్రీనాథ్, డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్, స్త్రీ నిధి, తెలంగాణ, డా. హెచ్.ఎస్. శైలేంద్ర, ప్రొఫెసర్, ఇర్మా, శ్రీ హరిప్రసాద్, మేనేజింగ్ డైరెక్టర్, స్త్రీ నిధి, ఆంధ్రప్రదేశ్

**చర్చాంశం:** *పరివర్తనకు చోదక శక్తులుగా స్వయం సహాయ సంఘాలు, సమాఖ్యలు.*

ఈ ప్యానెల్ చర్చలో స్వయం సహాయక సంఘాలు (ఎస్‌హెచ్‌జీ లు) , వాటి సమాఖ్యలు గత మూడు దశాబ్దాల కాలంలో సాధించిన విశిష్ట ఫలితాలను సమగ్రంగా విశ్లేషించారు. చిన్న స్థాయి పొదుపు – రుణ సంఘాలుగా ప్రారంభమైన ఎస్‌హెచ్‌జీలు, నేడు సామాజిక, ఆర్థిక, సంస్థాగత పరివర్తనకు నాయకత్వం వహించే శక్తివంతమైన ప్రజా సంస్థలుగా ఎదిగిన తీరును ప్యానెల్ సభ్యులు విశదీకరించారు.



చర్చా గోష్ఠి-2

మహిళా సాధికారత, ఆర్థిక సమ్మిళితం, జీవనోపాధుల ప్రోత్సాహం, నాయకత్వ వికాసం, పేదరిక నిర్మూలన వంటి రంగాల్లో ఎస్‌హెచ్‌జీలు పోషించిన కీలక పాత్రను వారు ప్రశంసించారు. సమాఖ్యలు సమాజ యాజమాన్యాన్ని బలోపేతం చేయడం, ఆర్థిక సేవలకు విస్తృత ప్రాప్యత కల్పించడం, మహిళా పారిశ్రామికతను ప్రోత్సహించడం, గ్రామీణ సమాజాల స్థైర్యాన్ని పెంపొందించడం వంటి అంశాల్లో కీలక వేదికలుగా అవతరించాయని పేర్కొన్నారు.

భారత అభివృద్ధి ప్రయాణంలో ఎస్‌హెచ్‌జీల పాత్ర నిరంతరం విస్తరిస్తోందని, ఇకపై వాటి ప్రాధాన్యం కేవలం ఆర్థిక సమ్మిళితానికే పరిమితం కాకుండా, స్థిరమైన జీవనోపాధుల సృష్టి, ప్రజాస్వామ్య సంస్థల పటిష్ఠీకరణ, మహిళల ఆధ్వర్యంలోని వ్యాపార సంస్థల అభివృద్ధి వైపు మరింతగా కేంద్రీకృతం కావాలని ప్యానెల్ అభిప్రాయపడింది. ఎస్‌హెచ్‌జీ ఉద్యమం సాధించిన విజయాలను గుర్తిస్తూ, అదే సమయంలో పైస్థాయి నుంచి అధిక నియంత్రణతో అమలవుతున్న విధానాలు, సంస్థల స్వయం ప్రతిపత్తి క్షీణించడం, జీవనోపాధుల వైవిధ్యీకరణలో లోపాలు, సమాఖ్యలలో మెరుగైన పాలన అవసరం వంటి కొత్త సవాళ్లను కూడా సభ్యులు ప్రస్తావించారు.

డిజిటల్ ఆవిష్కరణలు,సమాజ యాజమాన్యంలోని ఆర్థిక వ్యవస్థలు, నిరంతర సామర్థ్యాభివృద్ధి కార్యక్రమాలు భవిష్యత్ అభివృద్ధి సవాళ్లను సమర్థంగా ఎదుర్కొనేందుకు ఎస్‌హెచ్‌జీలను, సమాఖ్యలను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దగల ప్రధాన సాధనాలని పేర్కొన్నారు. సభ్యుల యాజమాన్యంలోని, ఆర్థికంగా స్వావలంబన కలిగిన సమాఖ్యలుగా అవి ఎదిగి, సూక్ష్మ వ్యాపారాల అభివృద్ధి, మార్కెట్ అనుసంధానం, స్థానిక ఆర్థిక వ్యవస్థల బలోపేతానికి కేంద్ర బిందువులుగా మారాలని సూచించారు.

భవిష్యత్తులో కూడా అవి సమర్థవంతంగా కొనసాగాలంటే సంస్థాగత స్వయం ప్రతిపత్తి, ప్రజాస్వామ్య పరిపాలన, నిరంతర సామర్థ్యాభివృద్ధి, డిజిటల్ నవకల్పనలు, అలాగే సమాజాన్ని అభివృద్ధి కేంద్రబిందువుగా నిలబెట్టే అనుకూల విధానాలు అత్యంత అవసరమని చర్చాగోష్ఠి పునరుద్ఘాటించింది. ■

పరస్పరం నమ్మకం అనుబంధానికి బలం, వారికోసం అవసరమైతే రాజీపడడం ఆ బంధానికి శాశ్వతత్వం

# వ్యాపార సంస్థలుగా ఎదిగితేనే ఎఫ్‌పిఓలకు మనుగడ

**అధ్యక్షత :** డా. సి. శంభు ప్రసాద్, ప్రొఫెసర్, ఇర్మా, ప్యానెల్ సభ్యులు: డా. జయప్రకాశ్ నారాయణ్, ప్రధాన కార్యదర్శి, ఎఫ్‌డీఆర్, శ్రీ ఉదయ్ భాస్కర్, సి జి ఎం, నాబార్డ్, తెలంగాణ, శ్రీ ఇమ్మాన్యుయేల్ వి. ముర్రే, ఇన్వెస్ట్‌మెంట్ డైరెక్టర్, క్యాస్పియన్ , శ్రీ యోగేష్ కుమార్ ద్వివేది, సీఈఓ, ఎం.బి.సి.ఎఫ్.పి.సి.ఎల్., శ్రీమతి బి. రాగిణి, సీఈఓ, వృత్తి

**చర్చాంశం:** అభివృద్ధి చెందుతున్న వ్యాపార సంస్థలుగా రైతు ఉత్పత్తిదారుల సంస్థలు (ఎఫ్‌పిఓలు).

ఈ ప్యానెల్ చర్చలో రైతు ఉత్పత్తిదారుల సంస్థలు (ఎఫ్‌పిఓలు) చిన్న, సన్నకారు రైతుల వ్యవసాయాన్ని



రూపాంతరం చేయగల స్థిరమైన, వృత్తిపరంగా నిర్వహించబడే, మార్కెట్ ఆధారిత వ్యాపార సంస్థలుగా ఎలా అభివృద్ధి చెందుతున్నాయనే అంశాన్ని సమగ్రంగా విశ్లేషించారు. భారత వ్యవసాయ రంగంలో ఎఫ్‌పిఓలు అత్యంత ప్రభావవంతమైన సంస్థాగత ఆవిష్కరణలలో ఒకటిగా అవతరించాయని, ఇవి రైతులను సమీకరించి ఉత్పత్తులను సమష్టిగా విక్రయించడం, నాణ్యమైన వ్యవసాయ ఉత్పాదకాలను తక్కువ వ్యయంతో పొందడం, బేరసారాల శక్తిని పెంపొందించడం, మార్కెట్ అనుసంధానాలను బలోపేతం చేయడం, వ్యవసాయ విలువ గొలుసుల్లో సమర్థవంతమైన భాగస్వామ్యాన్ని సాధించడం వంటి అనేక ప్రయోజనాలను అందిస్తున్నాయని ప్యానెలిస్టులు వివరించారు.

దేశవ్యాప్తంగా ఎఫ్‌పిఓల విస్తరణ గణనీయంగా జరిగినప్పటికీ, ఇకపై ప్రధాన లక్ష్యం వాటి సంఖ్యను పెంచడం కంటే ఇప్పటికే ఏర్పడిన సంస్థలను నాణ్యమైన, లాభదాయకమైన, వ్యాపారపరంగా స్థిరమైన సంస్థలుగా తీర్చిదిద్దడమే కావాలని వారు సూచించారు. ఇందుకోసం సుశాసనం, వృత్తిపరమైన నిర్వహణ, ఆర్థిక వనరుల లభ్యత, విలువవృద్ధి, మౌలిక వసతుల అభివృద్ధి, మార్కెట్ అనుసంధానం, డిజిటల్ పరివర్తన వంటి అంశాలపై మరింత దృష్టి సారించాల్సిన అవసరాన్ని వారు నొక్కి చెప్పారు. మారుతున్న వ్యవసాయ మార్కెట్ పరిస్థితుల్లో పోటీని తట్టుకునే సామర్థ్యం ఎఫ్‌పిఓలకు అత్యంత అవసరమని అభిప్రాయపడ్డారు.

**చర్చా గోష్ఠి-3**

చర్చ ముగింపులో, రైతు ఉత్పత్తిదారుల సంస్థలు దీర్ఘకాలిక విజయాన్ని సాధించాలంటే రైతుల యాజమాన్యంలోని, వృత్తిపరంగా నిర్వహించబడే, ఆర్థికంగా స్వావలంబన కలిగిన, మార్కెట్‌దృష్టితో పని చేసే సంస్థలుగా ఎదగాల్సిన అవసరం ఉందని ఏకగ్రీవంగా అభిప్రాయపడ్డారు.

సమర్థ నాయకత్వం, సుపరిపాలన, వృత్తిపరమైన నిర్వహణ, బాధ్యతాయుత ఆర్థిక వనరులు, డిజిటల్ సాంకేతికత వినియోగం, మార్కెట్ ఆధారిత వ్యాపార వ్యూహాలు, సహాయక ప్రజా విధానాలు మరియు బహుళ భాగస్వామ్య సహకారంతో ఎఫ్‌పిఓలు భారత వ్యవసాయ రంగాన్ని రూపాంతరం చేసే శక్తివంతమైన సంస్థలుగా ఎదిగి, రైతుల ఆదాయాన్ని పెంచడంతో పాటు సమగ్ర, సుస్థిర గ్రామీణాభివృద్ధికి బలమైన పునాదిగా నిలుస్తాయని సమావేశం పునరుద్ఘాటించింది. ■

అభిప్రాయాలూ వాస్తవాలు కావు ; సహృదయంతో , సదవగాహనతో ఆలోచిస్తేనే నిజం నిగ్గుతేలేది

# ప్రతికూల వాతావరణాన్ని తట్టుకునే వ్యవసాయమే రైతుకు రక్ష

**అధ్యక్షత :** శ్రీ నరేంద్రనాథ్, నేషనల్ కోయలిషన్ ఫర్ నేచురల్ ఫార్మింగ్ (ఎన్ సి ఎన్ ఎఫ్). ప్యానెల్ సభ్యులు : డా. నందితా రే, సహ-వ్యవస్థాపకురాలు, ఏపిమాస్, శ్రీ రవీంద్ర, డైరెక్టర్, వాసన్, శ్రీ సచిన్ ఓజా, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, డిఎస్‌సి ఫౌండేషన్, శ్రీమతి పద్మ, సహ-వ్యవస్థాపకురాలు, సీఈఓ, అరణ్య అగ్రికల్చర్ ఆల్టర్నేటివ్స్ , డా. బండి వెంకటేశ్వరులు, ఛైర్మన్, ఎన్ ఐ సి ఆర్ ఎ, డా. ఎస్. కుందు, శాస్త్రవేత్త, ఐసిఎఆర్ - సిఆర్ఐడిఎ.

**చర్చాంశం**: పర్యావరణ ఆధారిత (ఆగ్రో ఎకలాజికల్), ప్రతికూల వాతావరణ సహన వ్యవసాయం (క్లైమేట్ - రిసిలెంట్ ఫార్మింగ్)

## చర్చా గోష్ఠి-4

భారతీయ వ్యవసాయం నేడు ఎదుర్కొంటున్న వాతావరణ మార్పులు, భూసార శక్తి క్షీణత, నీటి కొరత, జీవ వైవిధ్య హ్రాసం, పెరుగుతున్న సాగు వ్యయాలు వంటి సవాళ్లను అధిగమించేందుకు వ్యవసాయ పర్యావరణ సూత్రాలపై ఆధారపడిన, వాతావరణ మార్పులను తట్టుకునే వ్యవసాయ విధానాలను అవలంబించడం అత్యవసరమని ఈ ప్యానెల్ చర్చ స్పష్టంగా పేర్కొంది. వ్యవసాయం కేవలం అధిక దిగుబడులు సాధించడమే కాకుండా లాభదాయకత, పర్యావరణ పరిరక్షణ, సహజ వనరుల సంరక్షణ మరియు చిన్న, సన్నకారు రైతుల జీవనోపాధి భద్రత మధ్య సమతుల్యతను నెలకొల్పాలని ప్యానెలిస్టులు అభిప్రాయపడ్డారు.

వ్యవసాయ పర్యావరణ విధానాలు (ఆగ్రో ఎకాలజీ), సహజ వ్యవసాయం (నేచురల్ ఫార్మింగ్), పునరుత్పాదక వ్యవసాయం (రీజనరేటివ్ అగ్రికల్చర్) వంటి విధానాలు నేల ఆరోగ్యాన్ని మెరుగుపరచడం, నీటి వినియోగ సామర్థ్యాన్ని పెంపొందించడం, రసాయన ఆధారిత బాహ్య ఇన్‌పుట్లపై ఆధారపడటాన్ని తగ్గించడం, జీవవైవిధ్యాన్ని సంరక్షించడం ద్వారా వ్యవసాయ వ్యవస్థలను మరింత స్థిరంగా, సుస్థిరంగా తీర్చిదిద్దగలవని వారు వివరించారు. సమాజ ఆధారిత కార్యక్రమాల అనుభవాలు రైతుల సంఘటిత కృషి, స్థానిక జ్ఞానం మరియు శాస్త్రీయ నవీనతల సమన్వయం ద్వారా వాతావరణ సంబంధిత ప్రమాదాలను సమర్థంగా ఎదుర్కొనే సామర్థ్యం పెరుగుతుందని వెల్లడించాయి.

ఈ లక్ష్యాల సాధనకు రైతు ఉత్పత్తిదారుల సంస్థలు (ఎఫ్‌పిఓలు), స్వయం సహాయక సంఘాలు (ఎస్‌హెచ్‌జీలు), పరిశోధనా సంస్థలు, వ్యవసాయ విస్తరణ వ్యవస్థలు మరియు రైతు సంఘాల సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేయాల్సిన అవసరాన్ని ప్యానెలిస్టులు నొక్కి చెప్పారు. వాతావరణం తట్టుకునే వ్యవసాయ పద్ధతులను విస్తృత స్థాయిలో అమలు చేయాలంటే విధానపరమైన సంస్కరణలు, శాస్త్రీయ మద్దతు, మార్కెట్ ప్రోత్సాహకాలు, విలువవృద్ధి, సరసమైన ఆర్థిక వనరుల ప్రాప్యత వంటి అంశాలు కీలకమని వారు అభిప్రాయపడ్డారు.

వాతావరణాన్ని తట్టుకునే వ్యవసాయ నిర్మాణం కోసం పర్యావరణ పరిరక్షణ, శాస్త్రీయ ఆవిష్కరణలు, బలమైన సమాజ ఆధారిత సంస్థలు, అనుకూల ప్రభుత్వ విధానాలు మరియు మార్కెట్ అవకాశాలు సమన్వయంతో కూడిన సమగ్ర దృక్పథం అవసరమని ప్యానెల్ ఏకగ్రీవంగా అభిప్రాయపడింది. భారతీయ వ్యవసాయ భవిష్యత్తు వాతావరణ అనుకూలత, సహజ వనరుల పరిరక్షణ, ఆర్థికంగా లాభదాయకమైన వ్యవసాయ నమూనాలు మరియు బలమైన రైతు సంస్థలు పరస్పరం అనుసంధానమై పని చేసే సమగ్ర వ్యవస్థల నిర్మాణంపై ఆధారపడి ఉందని ప్యానెలిస్టులు స్పష్టం చేశారు. రైతులకు అవసరమైన విజ్ఞానం, సంస్థాగత బలం, సాంకేతిక సహాయం మరియు అనుకూల పర్యావరణాన్ని కల్పించడం ద్వారానే భవిష్యత్తులో స్థిరమైన జీవనోపాధి, ఆహార భద్రత మరియు సుస్థిర గ్రామీణాభివృద్ధి సాధ్యమవుతుందని ప్యానెలిస్టులు విశ్వాసం వ్యక్తం చేశారు. ■

సమస్యలనుంచి పారిపోతుంటే ఏనాడూ గెలవలేవు , ఎదురు నిలిచి ఎదుర్కోవడమే విజయ రహస్యం !

# సమాజ ఆధారిత సమగ్ర ఆరోగ్య సంరక్షణ విధానాలు అవసరం

**అధ్యక్షులు :** డా.జనార్ధన్ రెడ్డి, మాజీ ఛైర్మన్, తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టిఎస్‌పిఎస్‌సి) ప్యానెల్ సభ్యులు : శ్రీమతి అనితా రామచంద్రన్, మాజీ కార్యదర్శి, మహిళా, శిశు అభివృద్ధి శాఖ, తెలంగాణ ప్రభుత్వం, శ్రీ జోస్, పోర్ట్‌ఫోలియో మేనేజర్, వాటర్.ఓఆర్‌జి, శ్రీమతి ఖ్యాతి తివారీ, పోషకాహార నిపుణురాలు, యునిసెఫ్ , శ్రీ ప్రవీణ్, సీనియర్ ప్రోగ్రామ్ మేనేజర్ – విప్రో కేర్స్, డా.లక్ష్మయ్య, మాజీ శాస్త్రవేత్త, జాతీయ పోషకాహార సంస్థ (ఎన్ ఐ ఎన్), డా. జానకి శ్రీనాథ్, అసిస్టెంట్ ప్రొఫెసర్, ఆహార మరియు పోషకాహార విభాగం, కాలేజ్ ఆఫ్ కమ్యూనిటీ సైన్స్



**చర్చా గోష్ఠి-5**

**చర్చాంశం:** ఆరోగ్యవంతమైన జీవనానికి 'వాష్', తగిన పోషకాహారం.

ఈ ప్యానెల్ చర్చలో నీరు, పారిశుద్ధ్యం, పరిశుభ్రత (వాష్)కు, పోషకాహారానికి మధ్య ఉన్న పరస్పర అనుబంధం ఆరోగ్యం, శ్రేయస్సు, మానవాభివృద్ధికి ఎంత కీలకమో సమగ్రంగా చర్చించబడింది. పారిశుద్ధ్యం, పోషకాహార రంగాల్లో గణనీయమైన పురోగతి సాధించినప్పటికీ, సురక్షితమైన తాగునీటి కొరత, తగిన పారిశుద్ధ్య సదుపాయాల లేమి, పరిశుభ్రత పట్ల సరైన అలవాట్ల లోపం, ముఖ్యంగా మహిళలు, పిల్లలు, బలహీన వర్గాలలో పోషకాహార లోపం వంటి సమస్యలు ఇంకా లక్షలాది కుటుంబాలను ప్రభావితం చేస్తున్నాయని ప్యానెల్ సభ్యులు పేర్కొన్నారు. ఈ సవాళ్లను అధిగమించడానికి రంగాలవారీగా విడివిడిగా కాకుండా, సమగ్రతతో కూడిన సమాజ ఆధారిత అభివృద్ధి విధానాలు అవసరమని వారు స్పష్టం చేశారు.

ప్రభుత్వ పథకాలు, పరిశోధనా సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, అభివృద్ధి భాగస్వాముల అనుభవాలను ప్రస్తావిస్తూ, ప్రవర్తనా మార్పు కమ్యూనికేషన్‌ను బలోపేతం చేయడం, ప్రతి కుటుంబానికి సురక్షితమైన తాగునీరు, పారిశుద్ధ్య సదుపాయాలను అందుబాటులోకి తీసుకురావడం, సమతుల్య ఆహారాన్ని ప్రోత్సహించడం, పోషకాహారంపై ప్రజల్లో అవగాహన పెంపొందించడం అత్యవసరమని వక్తలు పేర్కొన్నారు. ఈ లక్ష్యాల సాధనలో స్వయం సహాయక సంఘాలు (ఎస్‌హెచ్‌జీలు), కమ్యూనిటీ సంస్థలు మరియు స్థానిక నాయకత్వం కీలకమైన పరివర్తనాత్మక పాత్ర పోషించగలవని వారు నొక్కి చెప్పారు. అలాగే, ఆరోగ్యం, పోషకాహారం, వాష్, విద్య మరియు జీవనోపాధి కార్యక్రమాల మధ్య సమన్వయం పెంపొందించడం ద్వారా మాత్రమే ప్రజారోగ్యం మరియు పోషకాహార ఫలితాలలో స్థిరమైన మెరుగుదల సాధ్యమవుతుందని అభిప్రాయపడ్డారు.

చర్చ ముగింపులో, ఆరోగ్యకరమైన మరియు పోషకాహార భద్రత కలిగిన సమాజ నిర్మాణానికి వాష్, పోషకాహారం, ప్రవర్తనా మార్పు మరియు జీవనోపాధి కార్యక్రమాలను సమగ్రంగా అనుసంధానించిన కమ్యూనిటీ ఆధారిత విధానం అత్యంత అవసరమని ప్యానెల్ సభ్యులు ఏకగ్రీవంగా పేర్కొన్నారు. సమర్థవంతమైన ప్రభుత్వ విధానాలు, బలమైన భాగస్వామ్యాలు, నిరంతర ప్రజా చైతన్యం, సాధికారత పొందిన కమ్యూనిటీ సంస్థల సహకారంతోనే ఆరోగ్యవంతమైన, పోషకాహార భద్రతతో కూడిన సమాజాన్ని నిర్మించగలమని వారు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ■

నిజమైన ఆనందానికి చిరునామా నీ తోడ్పాటుతో సంతోషంగా జీవించేవారి కళ్లలో చిందే చిరునవ్వు

# పి4 కార్యక్రమంపై కుప్పంలో ముఖ్యమంత్రి సమీక్ష

**- ఎ. కళామణి**

**ఆం**ధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు ఇటీవల కుప్పంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో పి4 (పబ్లిక్ - ప్రైవేట్ - పీపుల్ పార్ట్నర్‌షిప్) కార్యక్రమం పురోగతిని సమీక్షించారు.

ఈ సందర్భంగా బంగారు కుటుంబాలు, బంగారు మిత్రలు, మార్గదర్శులతో ముఖాముఖి సమావేశమై కార్యక్రమం అమలు తీరు, క్షేత్రస్థాయి అనుభవాలను తెలుసుకుంటూ, బలహీన వర్గాల కుటుంబా లను స్థిరమైన జీవనోపాధులు, సమాజ భాగస్వామ్యం, సమిష్టి కృషి ద్వారా స్వావలంబనతో కూడిన సుసంపన్న కుటుంబాలుగా తీర్చిదిద్దాలనే ప్రభుత్వ సంకల్పాన్ని పునరుద్ఘాటించారు.

సభను ఉద్దేశించి ప్రసంగించిన ముఖ్యమంత్రి, పి4ను స్థిరమైన పేదరిక నిర్మూలన కోసం ప్రజల భాగస్వామ్యంతో ముందుకు సాగే మహత్తర ఉద్యమంగా అభివర్ణించారు. ఇది కేవలం ఆర్థిక సహాయం అందించే కార్యక్రమం మాత్రమే కాకుండా, ప్రభుత్వం, కార్పొరేట్ సామాజిక బాధ్యత (సిఎస్ఆర్) భాగస్వాములు, స్వచ్ఛంద సంస్థలు, సామాజిక సంస్థలు, బంగారు మిత్రలు, మార్గదర్శులు, బంగారు కుటుంబాల సమిష్టి కృషితో దీర్ఘకాలిక జీవనోపాధి అవకాశాలను సృష్టించే వినూత్న కార్యక్రమమని తెలిపారు.

ఎంబీకే 10:20 నమూనా గురించి ప్రస్తావిస్తూ, సమాజంలోని 10 శాతం మంది అగ్ర, 20 శాతం అత్యంత బలహీన కుటుంబాలకు మార్గనిర్దేశం చేసి, వారి అభివృద్ధికి తోడ్పడే విధంగా ఈ కార్యక్రమం రూపుదిద్దుకుందని వివరించారు. సంక్షేమ పథకాలపై ఆధారపడే విధానానికి బదులుగా, మార్గదర్శకత్వం, వ్యవస్థాపకత, సమాజ భాగస్వామ్యం ద్వారా స్థిరమైన జీవనోపాధులను సృష్టించడమే ఈ నమూనా లక్ష్యమని పేర్కొన్నారు.

ముఖ్యమంత్రి బంగారు కుటుంబాలు, బంగారు మిత్రలు, మార్గదర్శులతో ప్రత్యక్షంగా మాట్లాడి వారి అనుభవాలను తెలుసుకుని, కార్యక్రమం పట్ల వారు చూపుతున్న అంకితభావాన్ని అభినందించారు.

'మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్' (ఎం ఇ ఐ ఎల్), ఏపిమాస్ మద్దతుతో అభివృద్ధి సాధించిన జయమ్మ, టీవీఎస్ మోటార్, ఓఆర్ఆర్‌సీ సహకారంతో ముందుకు వచ్చిన సరస్వతి, అదానీ ఫౌండేషన్, ఏపీమాస్ సహకారంతో విజయపథంలో నడుస్తున్న కృష్ణవేణి తమ జీవిత గాథలను పంచుకున్నారు. వారి పట్టుదలను అభినందించిన ముఖ్యమంత్రి, ప్రతి కుటుంబం సంపద, ఆరోగ్యం, ఆనందం సాధించడమే పి4 అంతిమ లక్ష్యమని స్పష్టం చేశారు.

బంగారు మిత్రలు ప్రతి కుటుంబానికి నిరంతరం మార్గనిర్దేశం చేయాలని, వారి పురోగతిని క్రమం తప్పకుండా పరిశీలించాలని, అవసరమైన సమయంలో తగిన సహాయం అందించాలని సూచించారు. కార్యక్రమంలో జవాబుదారీ తనం, వేగం కొనసాగేందుకు ప్రతి మూడు నెలలకు ఒకసారి బంగారు కుటుంబాల పురోగతిని తానే స్వయంగా సమీక్షిస్తానని ప్రకటించారు.

ప్రతి కుటుంబ అభివృద్ధికి స్పష్టమైన లక్ష్యం ఉండాలని పేర్కొంటూ, ప్రతి బంగారు కుటుంబం తమ భవిష్యత్తుపై ఉన్నత ఆశయాలు కలిగి ఉండాలని, ప్రతి మార్గదర్శి ఆయా కుటుంబాల ఆశయాలు, సామర్థ్యాలు, జీవనోపాధి అవకాశాలను పరిగణనలోకి తీసుకుని స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక సమగ్ర కుటుంబాభివృద్ధి ప్రణాళికలను రూపొందించాలని సూచించారు.

వ్యవస్థాపకత, స్థిరమైన జీవనోపాధులు, నిరంతర మార్గదర్శకత్వమే శాశ్వత ఆర్థిక స్వావలంబనకు పునాదులని పేర్కొంటూ, కుటుంబాలు ఆర్థిక, సామాజిక స్థిరత్వాన్ని

సాధించే వరకు మార్గదర్శులు వారితో పాటు ఉండాలని పిలుపునిచ్చారు. విజయవంతమైన ప్రతి బంగారు కుటుంబం భవిష్యత్తులో ఒక మార్గదర్శిగా మారి మరిన్ని కుటుంబాలకు స్ఫూర్తిగా నిలవాలని సూచించారు.

విద్యనే పేదరికం నుంచి బయటపడే అత్యంత స్థిరమైన మార్గమని పేర్కొంటూ, బంగారు కుటుంబాల పిల్లలు ఉన్నత విద్య, నైపుణ్యాభివృద్ధి సాధించి తమకు నచ్చిన వృత్తుల్లో రాణించాలని ప్రోత్సహించారు. కుప్పం పరిసర ప్రాంతాల్లో వేగంగా జరుగుతున్న పారిశ్రామిక అభివృద్ధి, గుడుపల్లెలో ప్రతిపాదిత టెక్నాలజీ పార్కును ప్రస్తావిస్తూ, యువత రాబోయే ఉపాధి అవకాశాలకు తగిన నైపుణ్యాలను సంపాదించాలని సూచించారు.

మహిళల ఆర్థిక సాధికారత, ఆర్థిక స్వతంత్రం, నాయకత్వం, ఆరోగ్యం, పోషకాహారం, యువత నైపుణ్యాభివృద్ధి, ఉపాధి సామర్థ్యం – ఇవన్నీ స్థిరమైన పేదరిక నిర్మూలనకు కీలక స్తంభాలని పేర్కొన్నారు.

ప్రభుత్వ పథకాలు, కార్పొరేట్ సామాజిక బాధ్యత (సిఎస్ఆర్) కార్యక్రమాలు, స్వచ్ఛంద సంస్థల జోక్యాల మధ్య బలమైన సమన్వయం అవసరమని ముఖ్యమంత్రి నొక్కి చెప్పారు.

జీవనోపాధులు, విద్య, ఆరోగ్యం, పోషకాహారం, గృహాలు, పారిశుద్ధ్యం, తాగునీరు, ఆర్థిక చేరిక, నైపుణ్యాభివృద్ధి వంటి పేదరికంలోని అన్ని కోణాలను సమగ్రంగా పరిష్కరించినప్పుడే కుటుంబాలు స్వావలంబన సాధిస్తాయని, సంక్షేమంపై ఆధారపడే పరిస్థితి నుంచి బయటపడతాయని తెలిపారు.

అదానీ ఫౌండేషన్, టీవీఎస్ మోటార్, మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్ (ఎం ఇ ఐ ఎల్) తదితర సి ఎస్ ఆర్ భాగస్వాములు పి4 కార్యక్రమంలో జీవనోపాధులు, వ్యవస్థాపకత, నైపుణ్యాభివృద్ధి, దీర్ఘకాలిక మార్గదర్శకత్వం అందిస్తున్నందుకు వారిని ముఖ్యమంత్రి అభినందించారు.

భవిష్యత్తులో మరిన్ని కార్పొరేట్ సంస్థలు, దాతలు, పౌరులు ఈ ఉద్యమంలో భాగస్వాములు అవుతారని ఆశాభావం వ్యక్తం చేస్తూ, ఆంధ్రప్రదేశ్ అంతటా రెండు లక్షల మంది మార్గదర్శులను సమీకరించి జీరో పావర్టీ లక్ష్యాన్ని వేగంగా సాధిస్తామని తెలిపారు.

తన ప్రసంగం ముగింపులో ప్రభుత్వం, సి ఎస్ ఆర్ భాగస్వాములు, స్వచ్ఛంద సంస్థలు, మార్గదర్శులు, బంగారు మిత్రులు, బంగారు కుటుంబాలు అందరూ కలిసి పి4ను ప్రజల ఉద్యమంగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం విజయాన్ని అందించిన ఆర్థిక సహాయంతో కాకుండా, ప్రతి బంగారు కుటుంబం పొందిన ఆత్మవిశ్వాసం, గౌరవం, స్థిరమైన సుసంపన్నత ఆధారంగా కొలవాలని పేర్కొన్నారు. కుప్పంను దేశంలోనే తొలి జీరో పావర్టీ నియోజకవర్గంగా తీర్చిదిద్ది, ఆ అనుభవాన్ని జీరో పావర్టీ ఆంధ్రప్రదేశ్ సాధనకు ఆదర్శ నమూనాగా తీర్చిదిద్దాలన్న తన సంకల్పాన్ని పునరుద్ఘాటించారు.

సమీక్ష అనంతరం ముఖ్యమంత్రి పి4 కార్యక్రమం ద్వారా ఏర్పాటు చేసిన పలు జీవనోపాధి యూనిట్లను ప్రారంభించారు. వీటిలో జిగ్–జాగ్ టైలరింగ్ యూనిట్, ఆటో రిక్షా, స్టేషనరీ దుకాణం, వెల్డింగ్ యూనిట్, వస్త్ర వ్యాపారం మరియు ఇతర సూక్ష్మవ్యాపారాలు ఉన్నాయి.

పర్యటన ముగింపులో అదానీ ఫౌండేషన్, మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్, టీవీఎస్ మోటార్ సంస్థలకు చెందిన మార్గదర్శులు, అమలు భాగస్వాములైన ఏపిమాస్, ఓఆర్ఆర్‌సీ ప్రతినిధులు ప్రతి బంగారు కుటుంబానికి వారి ఆశయాలకనుగుణంగా దూరదృష్టితో కూడిన కుటుంబాభివృద్ధి సమగ్ర ప్రణాళికలను రూపొందించి, అవసరాలకు అనుగుణంగా సహకారం అందించాలని ముఖ్యమంత్రి సూచించారు. ప్రతి కుటుంబం సంపద, ఆరోగ్యం,ఆనందం సాధించేలా కృషిచేయాలని కోరారు.

ఈ సందర్భంగా ఏపీమాస్ ప్రధాన కార్య నిర్వాహణాధికారి శ్రీ సి. ఎస్. రెడ్డి, ముఖ్యమంత్రి గారికి **'ఎ జర్నీ విత్ మెనీ వాయిసెస్ : 25 ఇయర్స్ ఆఫ్ వాకింగ్ టుగెదర్"** అనే ఏపిమాస్ రజతోత్సవ ప్రచురణను అందజేశారు. ■

ఏమి అన్నావనేదానికంటె ఎలా అన్నావనేది ముఖ్యం, మనసును ఒప్పించినా నొప్పించినా అది మాటతీరే !

# ఆశా కార్యకర్తల సామర్థ్యం పెంపుదలకు రెండు రోజుల శిక్షణ

– జాహ్నవి ఎర్రబెల్లి

**మా**తా–శిశు ఆరోగ్యం, పోషణ, సమాజ ఆరోగ్య సేవల బలోపేతంలో ఆశా కార్యకర్తలు కీలక పాత్ర పోషిస్తున్నారు. వారి సేవలను మరింత ప్రభావవంతంగా చేయడానికి పట్టణ పోషణ పథకం (అర్బన్ న్యూట్రిషన్ ప్రాజెక్టు) ఆధ్వర్యంలో 2026 జూన్ 10–11 తేదీలలో కర్వాన్–1 పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (యుపిహెచ్‌సి) లో రెండు రోజుల రిఫ్రెషర్ శిక్షణ కార్యక్రమం నిర్వహించబడింది.

ఈ శిక్షణలో ఆశా కార్యకర్తల రోజువారీ బాధ్యతలు, గృహ సందర్శనల ప్రాముఖ్యత, గర్భిణీలు మరియు బాలింతలకు అందించాల్సిన సేవలు, శిశు సంరక్షణ, పోషణ, టీకాలు, ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు వంటి అంశాలపై సమగ్ర చర్చ జరిగింది. శిక్షణ ప్రారంభంలో ప్రీ–టెస్ట్ నిర్వహించి పాల్గొనేవారి ప్రస్తుత అవగాహన స్థాయిని అంచనా వేశారు.





గ్రూప్ చర్చలు, అనుభవాల పంచుకోవడం, ప్రశ్నోత్తరాల ద్వారా ఆశా కార్యకర్తలు తమ పని సమయంలో ఎదుర్కొంటున్న సవాళ్లను వివరించగా, వాటికి అనువైన పరిష్కార మార్గాలను శిక్షకులు సూచించారు. ముఖ్యంగా ఇంటింటి సందర్శనల ద్వారా గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు, కౌమార బాలికలకు అవసరమైన ఆరోగ్య, పోషణ సేవలు సమయానికి అందేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు.

శిక్షణలో సమన్వయ నైపుణ్యాలు, కమ్యూనికేషన్ నైపుణ్యాలు, రికార్డుల నిర్వహణ, ప్రభుత్వ ఆరోగ్య పథకాల అమలులో ఆశాల పాత్ర వంటి అంశాలపై కూడా ప్రత్యేక సెషన్లు నిర్వహించబడ్డాయి. ఆశా కార్యకర్తలు సమాజంతో సాన్నిహిత్యాన్ని పెంపొందించుకొని, ఆరోగ్యకరమైన ప్రవర్తనలను ప్రోత్సహించే మార్పు దూతలుగా వ్యవహరించాలని సూచించారు.

శిక్షణ ముగింపులో పోస్ట్ – టెస్ట్ నిర్వహించి, పాల్గొనేవారి జ్ఞానంలో వచ్చిన మెరుగుదలను అంచనా వేశారు. ఈ కార్యక్రమం ద్వారా ఆశా కార్యకర్తలలో సేవాభావం, ఆత్మవిశ్వాసం మరియు సామర్థ్యం మరింత పెరిగి, సమాజానికి నాణ్యమైన ఆరోగ్య సేవలను అందించడంలో వారు మరింత సమర్థవంతంగా పనిచేస్తారనే విశ్వాసాన్ని వ్యక్తం చేశారు.

ఈ రిఫ్రెషర్ శిక్షణ ఆశా కార్యకర్తల నైపుణ్యాలను పటిష్టం చేయడంతో పాటు, పట్టణ ప్రాంతాల్లో మాతా,శిశు ఆరోగ్యం, పోషణ ఫలితాలను మెరుగుపరచే దిశగా ఒక ముఖ్యమైన ముందడుగుగా నిలిచింది. ■

# ఎఫ్ - డయాగ్రమ్ సమాజానికి అందిస్తున్న సందేశం

- రాజోజుల బ్రహ్మచారి

**ఆ**రోగ్యమే మహాభాగ్యం అని మన పెద్దలు చెప్పిన మాట నేటి కాలంలో మరింత అర్థవంతంగా మారింది. ఆధునిక వైద్యం ఎంత అభివృద్ధి చెందినప్పటికీ, పరిశుభ్రత మరియు పారిశుద్ధ్యం లేకపోతే ప్రజారోగ్యాన్ని కాపాడడం అసాధ్యం. నేడు దేశవ్యాప్తంగా వైరల్ జ్వరాలు, డెంగ్యూ, అతిసారం, టైఫాయిడ్, హెపటైటిస్ వంటి వ్యాధులు ప్రజలను ఆందోళనకు గురి చేస్తున్నాయి. వీటిలో అనేక వ్యాధులు వ్యక్తిగత నిర్లక్ష్యం, బహిరంగ మలవిసర్జన, కలుషితమైన నీరు, అపరిశుభ్రమైన పరిసరాల వల్లే వ్యాపిస్తున్నాయి.

ఇలాంటి పరిస్థితుల్లో ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యు హెచ్ ఓ) మరియు వాష్ (వాటర్, శానిటేషన్ మరియు హైజీన్) కార్యక్రమాలు ప్రాచుర్యం కల్పిస్తున్న ఎఫ్–డయాగ్రామ్ ప్రజలకు ఒక విలువైన ఆరోగ్య పాఠాన్ని నేర్పుతోంది. మలంలోని సూక్ష్మక్రిములు ఎలా మనిషి శరీరంలోకి చేరి వ్యాధులకు కారణమవుతాయో ఈ దయాగ్రామ్ స్పష్టంగా వివరిస్తుంది.

**మలంలో ఏమి ఉంటాయి?**

మలం అనేది శరీరం నుండి బయటకు వెళ్లే వ్యర్థ పదార్థం మాత్రమే కాదు. ఇందులో లక్షల నుండి కోట్ల వరకు సూక్ష్మజీవులు, పరాన్నజీవులు మరియు ఇతర జీవ పదార్థాలు ఉంటాయి. ఒక వ్యక్తి అనారోగ్యంతో ఉంటే లేదా పరిసరాలు అపరిశుభ్రంగా ఉంటే, ఈ సూక్ష్మజీవులు ఇతరులకు వ్యాధులను వ్యాప్తి చేయగలవు.

**ఒక గ్రాము మలంలో సాధారణంగా ఉండేవి**

- సుమారు 10 కోట్లు (100 మిలియన్లు) వైరస్‌లు
- సుమారు 10 లక్షల (1 మిలియన్) బ్యాక్టీరియా
- సుమారు 1,000 పరాన్నజీవుల తిత్తులు (ప్రోటోజోన్ సిస్ట్స్)
- సుమారు 100 పరాన్నజీవుల గుడ్లు (హెల్మింత్ ఎగ్స్)

**ఎఫ్ –దయాగ్రమ్ అంటే ఏమిటి?**

ఒక వ్యక్తి బహిరంగ ప్రదేశంలో మలవిసర్జన చేసినప్పుడు, ఆ మలంలోని కోట్లాది సూక్ష్మక్రిములు నేల, నీరు, ఈగలు, చేతులు, పాదాలు, ఆహారం ద్వారా చుట్టుపక్కల వ్యాపిస్తాయి. చివరకు అవి మరో వ్యక్తి నోటిలోకి ప్రవేశించి వ్యాధులకు కారణమవుతాయి. ఈ మొత్తం ప్రక్రియనే ఎఫ్ –డయాగ్రామ్ వివరిస్తుంది.

ఇందులో "ఎఫ్" అనే ఆంగ్ల అక్షరంతో ప్రారంభమయ్యే ఆరు ప్రధాన మార్గాల ద్వారా క్రిములు చివరకు మనిషి నోటిలోకి చేరుతాయని వివరించబడింది. అవి:

- చేతి వేళ్లు ♦ పాదాలు
- ఈగలు ♦ పొలాలు, పంటలు
- ద్రవాలు, నీరు
- ఆహారం – చివరి సంక్రమణ దశ

**1. చేతి వేళ్లు**

మలవిసర్జన చేసిన తర్వాత సబ్బుతో చేతులు కడుక్కోక పోతే చేతులపై ఉండే సూక్ష్మక్రిములు ఆహారం, నీరు లేదా ఇతర వస్తువుల ద్వారా నోటిలోకి చేరతాయి. అందువల్ల భోజనం చేసే ముందు, ఆహారం తయారు చేసే ముందు మరియు మరుగుదొడ్డి ఉపయోగించిన తర్వాత తప్పనిసరిగా సబ్బుతో చేతులు కడుక్కోవాలి

**2 . పాదాలు**

బహిరంగ మలవిసర్జన వల్ల నేలపై ఉన్న మలాన్ని తొక్కడం ద్వారా సూక్ష్మక్రిములు పాదాలకు అంటుకుంటాయి. చెప్పులు లేకుండా నడవడం వల్ల ఈ ప్రమాదం మరింత పెరుగుతుంది. పాదాలకు అంటుకున్న క్రిములు ఇంట్లోకి చేరి నేల, వస్తువులు కలుషితమవుతాయి. చిన్నపిల్లలు నేలపై ఆడుకుంటూ ఆ క్రిములను చేతుల ద్వారా నోటిలోకి తీసుకునే అవకాశం ఉంది. కొన్ని పేగు పురుగుల లార్వాలు పాదాల

చర్మం ద్వారా కూడా శరీరంలోకి ప్రవేశిస్తాయి.

**నివారణ:**

- ఎల్లప్పుడూ చెప్పులు ధరించాలి.
- పాదాలను శుభ్రంగా కడుక్కోవాలి.

**3. ఈగలు**

ఈగలు మలంపై వాలిన తరువాత ఆహారంపై వాలుతాయి. ఈ ప్రక్రియలో మలంలోని సూక్ష్మక్రిములు ఆహారానికి చేరి, ఆ ఆహారం తినే వ్యక్తికి వ్యాధులు సోకుతాయి. అందుకే ఆహారాన్ని ఎల్లప్పుడూ మూతపెట్టి ఉంచాలి మరియు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి

**4. పొలాలు – పరిసరాలు**

బహిరంగ మలవిసర్జన వల్ల పొలాలు, నేల, పరిసరాలు కలుషితమవుతాయి. ఈ నేలలో పండిన కూరగాయలు, పండ్లు సరిగా కడగకుండా తింటే సూక్ష్మక్రిములు శరీరంలోకి ప్రవేశిస్తాయి. పిల్లలు నేలపై ఆడుకోవడం వల్ల కూడా క్రిములు నోటిలోకి చేరే అవకాశం ఉంది.

**5. ద్రవాలు, నీరు**

మలంతో కలుషితమైన బావులు, చెరువులు, నదులు లేదా ఇతర నీటి వనరుల నీటిని తాగడం వల్ల కలరా, టైఫాయిడ్, అతిసారం వంటి తీవ్రమైన వ్యాధులు వస్తాయి. అందువల్ల తాగునీటిని శుద్ధి చేసి మాత్రమే ఉపయోగించాలి.

**6. ఆహారం – చివరి సంక్రమణ దశ**

ఆహారం మన శరీరానికి పోషకాలను అందించే ప్రధాన ఆధారం. అయితే అదే ఆహారం పరిశుభ్రత లేకుండా తయారైతే లేదా భద్రపరచకపోతే వ్యాధులకు మూలంగా మారుతుంది.

ఎఫ్–డయాగ్రామ్‌లో ఆహారం అనేది మలంలోని వ్యాధికారక సూక్ష్మక్రిములు మనిషి నోటిలోకి చేరే చివరి మరియు అత్యంత కీలకమైన మార్గంగా పరిగణించబడుతుంది.

మలవిసర్జన అనంతరం చేతులను సబ్బుతో కడుక్కోకుండా వంట చేయడం, ఈగలు వాలిన ఆహారాన్ని తీసుకోవడం, కలుషితమైన నీటితో వంట చేయడం, పండ్లు, కూరగాయలను శుభ్రంగా కడగకుండా వినియోగించడం వంటి కారణాల వల్ల ఆహారం సూక్ష్మక్రిములతో కలుషితమవుతుంది. అలాంటి ఆహారాన్ని తీసుకున్నప్పుడు కలరా, టైఫాయిడ్, అతిసారం, అమీబియాసిస్, హెపటైటిస్–ఎ వంటి అంటువ్యాధులు సులభంగా వ్యాపిస్తాయి.

అందువల్ల వంట చేసే ముందు, భోజనం వడ్డించే ముందు సబ్బుతో చేతులు కడుక్కోవాలి. ఆహారాన్ని ఎల్లప్పుడూ మూతపెట్టి ఉంచాలి. కూరగాయలు, పండ్లను శుభ్రంగా కడిగి వినియోగించాలి. పరిశుభ్రమైన నీటితోనే వంట చేయాలి. వంటగది, పాత్రలు, ఆహార నిల్వ ప్రదేశాలను పరిశుభ్రంగా ఉంచాలి.

**మలం ద్వారా వ్యాపించే ప్రధాన వ్యాధులు**

కలరా, టైఫాయిడ్, అతిసారం, అమీబియాసిస్, హెపటైటిస్ ఎ, బి, పోలియో, పేగు పురుగుల వ్యాధులు, డైసెంటరీ.

**నివారణ మన చేతుల్లోనే ఉంది**

ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి పెద్దగా ఖర్చు అవసరం లేదు. కొన్ని మంచి అలవాట్లు ఉంటే చాలు.

- ప్రతి కుటుంబం మరుగుదొడ్డిని తప్పనిసరిగా ఉపయోగించాలి.
- మరుగుదొడ్డి ఉపయోగించిన తర్వాత, భోజనం ముందు సబ్బుతో చేతులు కడుక్కోవాలి.
- తాగునీటిని శుద్ధి చేసి మాత్రమే ఉపయోగించాలి.
- ఆహారాన్ని ఎల్లప్పుడూ మూతపెట్టి ఉంచాలి.
- ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి.
- పిల్లలకు చెప్పులు వేసే అలవాటు చేయాలి.
- బహిరంగ మలవిసర్జనను పూర్తిగా మానుకోవాలి.

బహిరంగ మలవిసర్జన నిర్మూలన, వాష్ (వాటర్, శానిటేషన్, హైజీన్) సూత్రాల అమలు, ప్రజల్లో నిరంతర అవగాహన పెంపొందించడం ద్వారా కలరా, టైఫాయిడ్, అతిసారం, హెపటైటిస్ వంటి అనేక అంటువ్యాధులను సమర్థవంతంగా నివారించవచ్చు. ■

గుణపాఠం నేర్పేవి తప్పులే కావు, ఏ గుణపాఠం నేర్పనిదే అసలైన తప్పు

# 'వాష్' పై మంచిర్యాల జిల్లాస్థాయి కార్యశాల!

– రాజోజుల బ్రహ్మాచారి

తెలంగాణ రాష్ట్రం మంచిర్యాల పట్టణంలోని కలెక్టర్ కార్యాలయం సమావేశ మందిరంలో 24.07.2026 నాడు నీరు, పారిశుధ్యం, పరిశుభ్రత (వాష్) పై జిల్లా స్థాయి కార్యశాలను నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మంచిర్యాల జిల్లా కలెక్టర్ శ్రీ కుమార్ దీపక్ , జిల్లా అదనపు కలెక్టర్ శ్రీ చంద్రయ్య, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీ ఎస్ కిషన్, గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ అడిషనల్ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీ అంజయ్య, పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీ సుభాష్, సెర్ప్ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్లు శ్రీమతి స్వర్ణలత, శ్రీమతి రాజుబాయి, శ్రీమతి వనజ, ఏపిమాస్ తెలంగాణా రాష్ట్ర వాష్ ప్రాజెక్ట్ అసిస్టెంట్ మేనేజర్ శ్రీ రాజోజుల బ్రహ్మాచారి, జిల్లా వాష్ ప్రాజెక్ట్ అధికారి శ్రీ మైత్రి ప్రవీణ్ పాల్గొన్నారు.



ముందుగా జిల్లా కలెక్టర్, అడిషనల్ కలెక్టర్ చేతుల మీదుగా జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమం ప్రారంభమైంది.

**వాష్‌పై నిరంతర అవగాహన: జిల్లా కలెక్టర్**

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గారు మాట్లాడుతూ గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రతి కుటుంబానికి సురక్షితమైన తాగునీరు, మెరుగైన పారిశుద్ధ్య సదుపాయాలు, వ్యక్తిగత పరిశుభ్రత అలవాట్లు అందుబాటులోకి రావడం ప్రజారోగ్య పరిరక్షణకు అత్యంత అవసరమని తెలిపారు.

ప్రజల్లో నీరు, పారిశుద్ధ్యం, పరిశుభ్రత (వాష్) అంశాలపై నిరంతర అవగాహన కల్పించడం ద్వారా అంటువ్యాధులను నివారించడంతో పాటు ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని అన్నారు.

మహిళా సంఘాలు, గ్రామ సంఘాలు, ఇతర కమ్యూనిటీ సంస్థలు ప్రజల్లో అవగాహన పెంపొందించడంలో కీలక పాత్ర పోషించాలని సూచించారు. ప్రతి కుటుంబం వ్యక్తిగత పరిశుభ్రతను పాటించడం, సురక్షితమైన తాగునీటి వినియోగం, ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం, ఇంట్లో తడి చెత్త, పొడి చెత్తను వేరు చేయాలనీ, మరుగుదొడ్లను క్రమం తప్పకుండా ఉపయోగించడం వంటి మంచి అలవాట్లను అలవరచుకోవాలని పిలుపునిచ్చారు.

ఈ చర్యలు కుటుంబాల ఆరోగ్యాన్ని మెరుగుపరచడమే కాకుండా సమాజ శ్రేయస్సుకు కూడా దోహదపడతాయని జిల్లా కలెక్టర్ గారు పేర్కొన్నారు.

**జిల్లాలో 7536 వాష్ రుణాల పంపిణీ**

వాష్ అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ శ్రీ రాజోజుల బ్రహ్మాచారి ఈ కార్యశాల ఉద్దేశము, ఎజెండా, ఏపిమాస్ చేస్తున్న కార్యక్రమాల గురించి వివరించారు. ఇప్పటివరకు ఈ జిల్లాలోని 9 మండలలో 7 మునిసిపాలిటీలలో 482 మంది సి. ఆర్. పి లకు వాష్‌పై అవగాహన కల్పించడం జరిగిందని, 7536 వాష్ రుణాలను సమీకరించి 8.32 కోట్ల మూలధనాన్ని వాష్ అవసరాల కోసం వాడుకునేటట్లు చేయడం జరిగిందని వివరించారు.

ఎవరైతే సామాజిక నీటిశుద్ధి ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తారో వారికి సబ్సిడీ రూపేణా రెండు లక్షల వరకు ఏపిమాస్

బలం అంటే ఇష్టంలేనివాటిని నాశనం చేయడం కాదు, ఇష్టమైనవాటిని కష్టమైనా సృష్టించుకోవడం



అందిస్తుందని చెప్పారు.

సంఘ సభ్యులు కమ్యూనిటి బోర్ బావి ఏర్పాటు చేసుకుంటే వారికి కూడా 25,000 వేల రూపాయల నుండి 30,000 వేల రూపాయల వరకు సబ్సిడీ ఇవ్వడం జరుగుతుందని చెప్పారు

**జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి గారి సందేశం:**

జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీ ఎస్ కిషన్ గారు మాట్లాడుతూ వాష్ అంశాల ప్రాముఖ్యతను అన్ని సంఘాలలో అందరికి వివరించాలని, అది జరగాలంటే మండలస్థాయిలో విఓఏ లకు మొదటి విడత శిక్షణ కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. నీరు పారిశుధ్యం, పరిశుభ్రత అజెండా అంశం అన్ని సంఘాలు / గ్రామసంఘాలు / సమాఖ్యలు / పట్టణ / మండల / జిల్లా సమాఖ్య సమావేశాలలో చర్చించాలన్నారు.

**కృతజ్ఞతా ప్రసంగం : మైత్రి ప్రవీణ్**

చివరగా ఏపిమాస్ మంచిర్యాల జిల్లా వాష్ ప్రాజెక్ట్ అధికారి శ్రీ మైత్రి ప్రవీణ్ వాష్ అంశంపై జిల్లా స్థాయి కార్యశాల నిర్వహణకు అనుమతి మంజూరు చేయడమే కాకుండా పూర్తి స్థాయిలో ప్రోత్సాహం అందించిన జిల్లా కలెక్టర్ గారికి, కార్యశాల నిర్వహణలో ప్రారంభం నుండి ముగింపు వరకు మార్గనిర్దేశం చేస్తూ, అన్ని విధాలుగా సమన్వయం చేసి కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించడంలో కీలక పాత్ర పోషించిన సెర్ప్ జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ గారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

జిల్లా వైద్యాధికారి గారికి, సెర్ప్ అడిషనల్ ప్రాజెక్ట్ డైరెక్టర్ గారికి, డి ఆర్ డి ఏ జిల్లా ప్రాజెక్ట్ అధికారులకు మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ గారికి, కార్యక్రమంలో పాల్గొన్న సెర్ప్ , మెప్మా సిబ్బంది అందరికీ ధన్యవాదాలు తెలిపారు. ■

# పండ్ల తోటలు ఎండకుండా రక్షణ చర్యలు

- డ్రిప్ ఇరిగేషన్‌తో 40-50 శాతం నీటిని ఆదా చేయొచ్చు. పండ్ల తోటల్లో పూత, ఫలదీకరణ దశల్లో నీరు అందించాలి.
- గొట్టపు బావులపై ఆటోమేటిక్ స్టార్టర్ల వాడకాన్ని నిలిపివేయాలి. ఆటోమేటెడ్ డ్రిప్ విధానానికి మారాలి.
- మొక్కలు వడబడకుండా చల్లని సమయాల్లో తరచూ నీటిని అందించాలి. తోటల్లో నీటి తేమ పెరిగేలా చర్యలు తీసుకోవాలి.
- చెట్ల మొదళ్లకు సున్నం రాయాలి. వేడి గాలులు తగలకుండా చిన్న మొక్కలకు షేడ్‌నెట్లు వాడాలి.
- నిమ్మ, తీపి నారింజ, తోటలకు రోజుకు, ఒక్కో మొక్కకు 80-100 లీటర్లు, మామిడికి 30-40 లీటర్లు, సపోటాకు 25-40 లీటర్ల నీటిని మొక్క స్థితిని బట్టి అందించాలి.
- దానిమ్మకు 20-35 లీటర్లు, బొప్పాయికి 25 లీటర్లు, అరటికి 8-12 లీటర్లు, జామకు 20-30, జీడి మామిడికి 20 లీటర్ల నీటిని మొక్క స్థితిని బట్టి అందించాలి.
- పండ్లు పగలిపోకుండా, తొక్కను స్థిరత్వం చేసే కాల్షియం వాడాలి. పండ్లకు కవర్లు తొడగాలి. చెట్లకు గాలి నిరోధక ఊతకర్రలు పాతాలి.
- ఎండ వేడిని తట్టుకునేలా పొటాషియం వేయాలి. నత్రజని ఎరువులు తగ్గించాలి. అధిక వేడి సమయాల్లో యూరియా వాడకూడదు.
- వేడి, పొడి వాతావరణాల్లో రసం పీల్చే పురుగులు వ్యాప్తి చెందుతాయి. వారానికోసారి తప్పనిసరిగా నివారణ చర్యలు చేపట్టాలి. తెగుళ్ల నిర్మూలనకు కొమ్మలపై పసుపు, నీలి రంగు ఉచ్చులు వేలాడదీయాలి. తోట మొత్తం సమగ్ర సస్యరక్షణ చర్యలు పాటించాలి. ■

మన మనస్సు ఒక అయస్కాంతం! మంచిని తలిస్తే మంచిని, చెడును తలిస్తే చెడును అది ఆకర్షిస్తుంది

# తెలంగాణ జిల్లా సమాఖ్యల పధాధికారులకు రెండు రోజుల శిక్షణ

– జి. శ్రీనివాస్

గ్రామీణ మహిళల సాధికారతలో స్వయం సహాయక సంఘాలు (ఎస్‌హెచ్‌జీలు) కీలక పాత్ర పోషిస్తున్నాయి. ఈ సంఘాలకు గ్రామ, మండల, జిల్లా స్థాయిలో నాయకత్వం అందిస్తూ, వాటి బలోపేతానికి కృషి చేసే అత్యున్నత కమ్యూనిటీ సంస్థలు జిల్లా సమాఖ్యలు.

కాలానుగుణంగా మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా జిల్లా సమాఖ్యలను మరింత సమర్థవంతంగా, ఆర్థికంగా స్వయం సమృద్ధిగా, సభ్యుల అవసరాలకు అనుగుణంగా సేవలందించే సంస్థలుగా తీర్చిదిద్దే లక్ష్యంతో సొసైటీ ఫర్ ఎలిమినేషన్ ఆఫ్ రూరల్ పావర్టీ తెలంగాణ (సెర్ప్), తెలంగాణ మహిళా అభివృద్ధి సొసైటి (టి మాస్), మరియు స్త్రీనిధి క్రెడిట్ కో ఆపరేటివ్ ఫెడరేషన్ సంయుక్త ఆధ్వర్యంలో జూలై 20–21, 2026 తేదీల్లో హైదరాబాద్ లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ మైక్రో, స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్ (ఎన్ఐ-ఎంఎస్ఎంఇ) లో రెండు రోజుల రాష్ట్ర స్థాయి శిక్షణ-వర్క్‌షాప్ నిర్వహించటం జరిగింది. ఇందులో తెలంగాణలోని 16 జిల్లా సమాఖ్యల నుంచి 38 మంది అధ్యక్షులు, కార్యదర్శులు, కోశాధికారులు పాల్గొన్నారు.

ఈ శిక్షణా కార్యక్రమం జిల్లా సమాఖ్యల పాత్రను పునరుజ్జీవింపజేయడం, సమర్థవంతమైన నాయకత్వాన్ని పెంపొందించడం, ఆర్థిక నిర్వహణ, పారదర్శక పాలన, సభ్యులకు అవసరమైన సేవల విస్తరణ, సంస్థాగత సుస్థిరత వంటి అంశాలపై సమగ్ర అవగాహన కల్పించే లక్ష్యంతో నిర్వహించబడింది.

కార్యక్రమాన్ని సెర్ప్ ఇన్‌స్టిట్యూషన్ బిల్డింగ్ డైరెక్టర్ శ్రీ నవీన్‌కుమార్ ప్రారంభించారు. జిల్లా సమాఖ్యలు తెలంగాణలో మహిళా సంఘాల ఉద్యమానికి వెన్నెముకగా నిలుస్తున్నాయని, భవిష్యత్తులో అవి సభ్యుల ఆధారిత, ఆర్థికంగా స్వయం సమృద్ధిగల, వృత్తిపరంగా నిర్వహించబడే సంస్థలుగా ఎదగాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు.

టి మాస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్రీమతి ఎస్. రామలక్ష్మి, శిక్షణా కార్యక్రమం ఉద్దేశాలను వివరించారు. శిక్షణలో పాల్గొనే ప్రతి ప్రతినిధి తన జిల్లా సమాఖ్య బలోపేతానికి కార్యాచరణ ప్రణాళికతో తిరిగి వెళ్లేలా కార్యక్రమాన్ని రూపొందించినట్లు తెలిపారు. అనంతరం శ్రీ భీమయ్య (ప్రాజెక్ట్ మేనేజర్, సెర్ప్), శ్రీమతి స్వర్ణలత (ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్, సెర్ప్) జిల్లా సమాఖ్యల ప్రాముఖ్యతను వివరించారు.

మొదటి రోజు ప్రతి జిల్లా సమాఖ్యల వారీగా తమ సంస్థ వివరాలు, సభ్యుల సంఖ్య, సేవలు, ఆర్థిక స్థితి, మానవ వనరులు, వ్యాపార కార్యకలాపాలు, ఎదుర్కొంటున్న సవాళ్లను ప్రదర్శించారు. ఈ సెషన్‌ను శ్రీమతి ఎస్. రామలక్ష్మి నిర్వహించారు. జిల్లాల మధ్య అనుభవాల పంచుకోవడం ద్వారా అనేక ఉత్తమ విధానాలు వెలుగులోకి వచ్చాయి.

**లాభాలబాటలో సమాఖ్యలు**

ఈ ప్రదర్శనల్లో పాల్గొన్న 16 జిల్లా సమాఖ్యలలో 15 జిల్లా సమాఖ్యలు 2025–26 ఆర్థిక సంవత్సరంలో లాభాలు నమోదు చేయగా, ఒక జిల్లా సమాఖ్య మాత్రమే నష్టాల్లో ఉన్నట్లు వెల్లడైంది. దీని ద్వారా మంచి ఆర్థిక నిర్వహణ, సభ్యులకు సేవలు అందించడం ద్వారా జిల్లా సమాఖ్యలు ఆర్థికంగా బలోపేతం కావచ్చని చర్చించారు.

**సంఘాలకు, సమాఖ్యలకు ఎదురవుతున్న సమస్యలు**

ఈ సెషన్‌ను శ్రీ మురళి జాజున నిర్వహించారు. ఎస్‌హెచ్‌జీలు, గ్రామ సంఘాలు (విఓలు), మండల సమాఖ్యలు (యంఎస్‌లు), జిల్లా సమాఖ్యలు ఎదుర్కొంటున్న సమస్యలను పాల్గొన్న ప్రతినిధులు స్వయంగా గుర్తించారు. ప్రధానంగా, కొన్ని ఎస్‌హెచ్‌జీ సమావేశాలు సక్రమంగా జరగకపోవడం, బుక్ కీపింగ్ బలహీనంగా ఉండటం, కొన్ని

మండల సమాఖ్యల్లో కొన్ని చోట్ల పాత రుణాల బకాయిలు ఉండటం, జిల్లా సమాఖ్యలకు స్థిరమైన ఆదాయ వనరులు లేకపోవడం, యం ఐ ఎస్ వ్యవస్థలు, సిబ్బంది నిర్వహణలో సమస్యలు వంటి అంశాలపై చర్చించారు.

జిల్లా సమాఖ్యలను మరింత సమర్థవంతంగా ఎలా తీర్చిదిద్దాలి అనే అంశంపై శ్రీ పి. గంగాధర్ ఆధ్వర్యంలో గ్రూప్ చర్చలు జరిగాయి. పాలన, సభ్యులకు సేవలు, ఆర్థిక నిర్వహణ, అంతర్గత నియంత్రణ, సిబ్బంది బాధ్యతలు, సుస్థిరత వంటి ఆరు అంశాలపై గ్రూపులు చర్చించి తమ సూచనలు సమర్పించాయి.

**సమర్థవంతమైన నాయకత్వంపై ప్రత్యేక శిక్షణ :** "జిల్లా సమాఖ్య కార్యనిర్వాహక సభ్యుల పాత్ర , బాధ్యతలు" అనే అంశంపై శ్రీ జి. శ్రీనివాస్ శిక్షణ ఇచ్చారు. నాయకత్వ లక్షణాలు, చట్టాలు, బైలాస్, ఆర్థిక నివేదికల విశ్లేషణ, వార్షిక ప్రణాళిక, వనరుల సమీకరణ వంటి అంశాలను వివరించారు. ప్రతి ప్రతినిధితో స్వీయ మూల్యాంకనం చేయించి, నాయకత్వ సామర్థ్యాలను అంచనా వేయించారు.

**సభ్యుల అవసరాలకు అనుగుణమైన సేవలు :** రెండవ రోజు తొలి సెషన్‌ను శ్రీ పి. గంగాధర్ , శ్రీమతి ఎస్. రామలక్ష్మి నిర్వహించారు. జిల్లా సమాఖ్యలు సభ్యులకు కేవలం రుణ సేవలు మాత్రమే కాకుండా వ్యాపారాభివృద్ధి, నైపుణ్య శిక్షణ, మార్కెట్ అనుసంధానం, ఆరోగ్యం, పోషకాహారం, మహిళల హక్కులు, ఉపాధి అవకాశాలు వంటి విభిన్న రంగాల్లో సేవలు అందించాలని సూచించారు.

**ఆర్థిక నిర్వహణపై సమగ్ర శిక్షణ :** శ్రీ మురళి జాజున ఆర్థిక నిర్వహణపై ప్రత్యేక సెషన్ నిర్వహించారు. బడ్జెట్ తయారీ, అకౌంటింగ్, ఆర్థిక నివేదికలు, ఆడిట్లు, అంతర్గత నియంత్రణ, వనరుల సమీకరణ, ఆర్థిక క్రమశిక్షణ వంటి అంశాలపై ప్రాక్టికల్ ఉదాహరణలతో వివరించారు.

**అంతర్గత నియంత్రణ వ్యవస్థలు :** శ్రీమతి ఎస్. రామలక్ష్మి నిర్వహించిన ఈ సెషన్‌లో అకౌంటింగ్, యంఐఎస్, క్యాష్ మేనేజ్‌మెంట్, అంతర్గత ఆడిట్లు, విధానాలఅమలు, రికార్డుల నిర్వహణ వంటి అంశాలపై కేస్ స్టడీల ద్వారా చర్చించారు.

**సిబ్బంది బాధ్యతలు – సంస్థ విజయానికి కీలకం :** శ్రీ జి. శ్రీనివాస్ జిల్లా సమాఖ్య మేనేజర్, అకౌంటెంట్, కంప్యూటర్ ఆపరేటర్ తదితర సిబ్బంది పాత్రలు, బాధ్యతలను వివరించారు. ఎన్నికైన ప్రతినిధులు మరియు సిబ్బంది పరస్పర సమన్వయంతో పని చేస్తేనే సంస్థలు బలోపేతం అవుతాయని వివరించారు.

**సుస్థిర జిల్లా సమాఖ్యల నిర్మాణం :** చివరి సాంకేతిక సెషన్‌ను శ్రీ పి. గంగాధర్ నిర్వహించారు. జిల్లా సమాఖ్యలు సభ్యులకు విలువైన సేవలందిస్తూ, విభిన్న ఆదాయ వనరులను అభివృద్ధి చేసుకుంటూ, ప్రభుత్వ శాఖలు, ఆర్థిక సంస్థలు, ఇతర సంస్థలతో భాగస్వామ్యాలు ఏర్పరచుకోవాలని సూచించారు.

**సెర్ప్ అధికారులతో ముఖాముఖి :** శిక్షణ ముగింపులో శ్రీ నవీన్ కుమార్, డైరెక్టర్(ఐబి), సెర్ప్ జిల్లా సమాఖ్యల ప్రతినిధులతో ప్రత్యేకంగా సమావేశమై శిక్షణలో నేర్చుకున్న అంశాలను జిల్లాల్లో అమలు చేయాలని సూచించారు. సభ్యులకు నాణ్యమైన సేవలు అందించడం, పారదర్శక పాలన, ఆర్థిక స్వావలంబన సాధించడంపై దృష్టి పెట్టాలని పిలుపునిచ్చారు.

**ఆరు నెలల కార్యాచరణ ప్రణాళిక :** శిక్షణలో ప్రతి జిల్లా సమాఖ్య తన జిల్లాకు ప్రత్యేకంగా ఆరు నెలల కార్యాచరణ ప్రణాళిక రూపొందించింది. ఇందులో : ఎస్‌హెచ్‌జీల బలోపేతం, నాణ్యమైన బుక్ కీపింగ్, అంతర్గత ఆడిట్లు, డిజిటలైజేషన్, ఆర్థిక క్రమశిక్షణ, సభ్యుల భాగస్వామ్యం, ఆదాయ వనరుల అభివృద్ధి, పాలనా వ్యవస్థ బలోపేతం, సుస్థిర వ్యాపార నమూనాల అభివృద్ధి వంటి అంశాలపై పని చేయటానికి ప్రణాళిక తయారు చేసుకున్నారు. ఇట్టి ప్రణాళికా జిల్లాలలో బోర్డు సమావేశాలను నిర్వహించి అందులో పూర్తిస్థాయిలో చర్చించాలనుకున్నారు.

**శిక్షణ ఫలితాలు:** పాల్గొన్న ప్రతినిధులు ఈ శిక్షణ ద్వారా జిల్లా సమాఖ్యల భవిష్యత్ దిశపై స్పష్టమైన అవగాహన పొందారు. మంచి పాలన, ఆర్థిక నిర్వహణ, సభ్యుల ఆధారిత సేవలు, సిబ్బందిబాధ్యతలు, సంస్థాగత సుస్థిరత వంటి అంశాల్లో తమ సామర్థ్యం పెరిగిందని అభిప్రాయపడ్డారు. భవిష్యత్తులో ఇలాంటి శిక్షణలు తరచూ నిర్వహించాలని కోరారు. ■

ఇతరులు చూడలేనిదానిని చూడగలగడమే దార్శనికత్వం, సాధించడమే సామర్థ్యం

# పిల్లల పోషణపై అవగాహనకోసం సామూహిక అన్నప్రాశన

**– జాహ్నవి, ఎర్రబెల్లి**

**అ**న్నప్రాశన అనేది పిల్లల జీవితంలో ఒక ముఖ్యమైన ఘట్టం. పిల్లలకు ఆరు నెలలు పూర్తయిన తర్వాత తల్లి పాలతో పాటు అనుబంధ ఆహారం (కాంప్లిమెంటరీ ఫీడింగ్) ప్రారంభించే సమయం అని తల్లులకు తెలియజేయడానికి ఏపిమాస్ పట్టణ పోషణ పథకం బృందం వారు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో సాయినగర్-1, సాయినగర్-2, హీరానగర్, కర్వాన్-2 , జాఫర్‌గూడ అంగన్‌వాడీ కేంద్రాలకు చెందిన 17 మంది పిల్లలకు సామూహిక అన్న ప్రాశన కార్యక్రమం నిర్వహించారు. లబ్ధిదారులు ఒకే వేదికపై పాల్గొన్నారు.

ఈ కార్యక్రమం ద్వారా పిల్లలకు సరైన సమయంలో, సరైన పరిమాణంలో, సరైన ఆహారం ఇవ్వడం ఎంత ముఖ్యమో వివరించారు. మొదటి ఆరు నెలల వరకు తల్లి పాలు మాత్రమే పిల్లలకు సరిపోతాయని, అయితే ఆరు నెలల తర్వాత పిల్లలకు ఎదుగుదల వేగంగా జరిగే కారణంగా తల్లి పాలతో పాటు అదనపు పోషకాహారం అవసరమవు తుందని తెలిపారు. పిల్లలకు ఇంట్లో లభించే బియ్యం, పప్పులు, రాగులు, జొన్నలు, కూరగాయలు, పండ్లు వంటి స్థానికంగా లభించే పోషకాహార పదార్థాలతో సమతుల్య ఆహారం తయారు చేసి ఇవ్వాలని వివరించారు.

స్టాండర్డ్ ఫీడింగ్ బౌల్ ద్వారా పిల్లలకు ఒక్కో వయస్సులో ఎంత పరిమాణంలో ఆహారం ఇవ్వాలో ప్రదర్శన చేసి వివరించారు. పిల్లలకు ఆహారాన్ని ప్రారంభించే సమయంలో కొద్దికొద్దిగా ఇవ్వడం మొదలుపెట్టి, వయస్సుకు, ఆకలికి అనుగుణంగా క్రమంగా పరిమాణాన్ని పెంచాలని సూచించారు. ఏడవ నెల నుంచి గుడ్డును, ముఖ్యంగా గుడ్డు పచ్చసొనను కూడా పిల్లలకు ఇవ్వవచ్చని, అది మెదడు అభివృద్ధికి, శారీరక ఎదుగుదలకు అవసరమైన ప్రోటీన్లు, విటమిన్లను, ఇతర పోషకాలను అందిస్తుందని తెలియజేశారు. ప్రభుత్వం అందించే బాలామృతం పిల్లలకు ఎంతో పోషకవిలువలు కలిగిన ఆహారమని, దానిని క్రమం తప్పకుండా ఇవ్వడంతో పాటు ఇంట్లోనే ధాన్యాలు, పప్పులతో తయారు చేసే అల్పాహారాన్ని ఇవ్వాలని, మార్కెట్‌లో లభించే ప్యాకెట్ ఆహారాల కంటే ఇవే ఆరోగ్యకరమైనవని వివరించారు.

అలాగే పిల్లలకు టీకాల షెడ్యూల్ ప్రకారం అన్ని టీకాలను సమయానికి వేయించాల్సిన అవసరాన్ని తెలియ జేశారు. ఆహారం తయారు చేసే ముందు , పిల్లలకు తినిపించే ముందు సబ్బుతో చేతులు కడుక్కోవడం, శుభ్రమైన పాత్రలను ఉపయోగించడం, పరిశుభ్రత పాటించడం వల్ల ఇన్‌ఫెక్షన్లు మరియు విరేచనాలు తగ్గుతాయని చెప్పారు. పిల్లలను బలవంతంగా తినిపించకుండా ప్రేమగా, ఓర్పుతో, వారితో మాట్లాడిస్తూ స్పందనాత్మకంగా (రెస్పాన్సివ్ ఫీడింగ్) తినిపించాలని సూచించారు. ప్రతి నెల అంగన్‌వాడీ కేంద్రానికి తీసుకువెళ్లి బరువు, ఎదుగుదలను పరిశీలించుకోవాలని, అవసరమైన పోషకాహార సలహాలు పొందాలని ప్రాజెక్ట్ మేనేజర్ భవాని సూచించారు.

శిశు సంక్షేమ శాఖ నుండి సీడీపీఓ శ్రీమతి రేణుక గారు గర్భధారణ ప్రారంభమైన రోజు నుండి పిల్లలకు రెండు సంవత్సరాలు పూర్తయ్యేవరకు ఉండే మొదటి 1000 రోజుల ప్రాముఖ్యతను వివరించి, ఈ కాలంలో సరైన పోషకాహారం అందించడం ద్వారా పిల్లల మెదడు అభివృద్ధి, శారీరక ఎదుగుదల , భవిష్యత్తు ఆరోగ్యం మెరుగుపడుతుందని చెప్పారు. తల్లులు బాలామృతాన్ని కొద్దికొద్దిగా ప్రారంభించి, పిల్లల వయస్సు, ఆకలికి, అవసరాలకు అనుగుణంగా క్రమంగా పరిమాణాన్ని పెంచాలని సూచించారు. అంతే కాకుండా, ప్రతిరోజూ ఇంట్లో తాజాగా తయారుచేసిన పోషకాహారాన్ని అందించడం ద్వారా పిల్లలు ఆరోగ్యంగా, బలంగా ఎదుగుతారని, ఈ సూచనలను ప్రతి తల్లి

తప్పనిసరిగా పాటించాలని ఆమె కోరారు.

ఈ కార్యక్రమం తర్వాత ప్రతి 15 రోజులకు ఒకసారి ఏపిమాస్ బృందంవారు తల్లులను కలిసి, వారు కార్యక్రమం లో చెప్పిన విధంగా పిల్లలకు ఆహారం ఇస్తున్నారా లేదా అనే విషయాన్ని తెలుసుకుంటారు. పిల్లలకు 6 నెలల తర్వాత అనుబంధ ఆహారం ప్రారంభించారా, రోజుకు ఎన్ని సార్లు ఆహారం పెడుతున్నారు, వివిధ రకాల పోషకాహారం ఇస్తున్నారావంటి విషయాలను పరిశీలిస్తారు. కొంతమంది తల్లులకు పిల్లలు ఆహారం తినకపోవడం, ఆకలి తక్కువగా ఉండటం, కొన్ని ఆహారాలపై అపోహలు ఉండటం లేదా ఇతర ఇబ్బందులుండవచ్చు. అలాంటి తల్లులకు ప్రత్యేకంగా సూచనలు ఇచ్చి, వారి సమస్యలకు తగిన పరిష్కారాలు చెబుతారు. అవసరమైతే మళ్లీ ఆహారం తయారీ మరియు తినిపించే విధానాన్ని ప్రదర్శించి చూపిస్తారు. అలాగే పిల్లల సంరక్షణలో పాల్గొనే నాన్నమ్మలు, అమ్మమ్మలు, ఇతర కుటుంబ సభ్యులకు కూడా సరైన పోషకాహారం గురించి అవగాహన కల్పిస్తారు. ఈ ఫాలో-అప్ ద్వారా తల్లులు మంచి ఆహారపు అలవాట్లను నిరంతరం పాటించేలా ప్రోత్స హించడంతో పాటు, పిల్లల ఎదుగుదల, బరువు, ఆరోగ్యాన్ని క్రమం తప్పకుండా పరిశీలించి, ఏవైనా పోషకాహార లోపాలు ఉంటే ముందుగానే గుర్తించి తగిన సూచనలు అందిస్తారు. దీని వల్ల పిల్లల ఆరోగ్యకరమైన ఎదుగుదల మరియు అభివృద్ధికి మంచి ఫలితాలు లభిస్తాయి.

ఈ కార్యక్రమంలో ఏపిమాస్ బృందం నుండి ప్రాజెక్ట్ మేనేజర్ భవాని, పిఓలు జాహ్నవి, లయ, ఆరోగ్య కార్యకర్తలు, తల్లులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎం ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో నిర్వహించిన పరస్పర చర్చలు, ప్రశ్నోత్తరాలు ,ప్రదర్శనల ద్వారా పిల్లల పోషణకు సంబంధించిన ఆహార పద్ధతులపై వారికి మెరుగైన అవగాహన ఏర్పడింది. ఈ సమాచారాన్ని ఆచరణలో పెట్టి, తమ పిల్లల ఆరోగ్యకరమైన ఎదుగుదల మరియు సమగ్ర అభివృద్ధి కోసం సూచించిన పోషకాహార మరియు సంరక్షణ పద్ధతులను పాటిస్తామని పాల్గొన్న తల్లులు, సంరక్షకులు తమ నిబద్ధతను వ్యక్తం చేశారు. ■

## 'వాష్ 'తోడ్పాటుతో వాటర్‌ప్లాంట్ ఏర్పాటు

– లక్ష్మీదేవి



**అ**నంతపురం జిల్లా తాడిపత్రి మమడలం ఎగువపల్లి గ్రామంలో రైతు ఉత్పత్తిదారుల పరస్పర సహకార సహాయక సంఘం (ఎఫ్‌పిఓ) 2019లో మిషన్ హార్టికల్చర్ డెవలప్ మెంట్ (యంహెచ్‌డి) కింద స్థాపించబడింది. ఇందులో 400 మంది సభ్యులు (మగ, ఆడరైతులు) ఉన్నారు. ఈ సంఘంలో అందరు చిన్న సన్నకారు రైతులే. 12 మంది బోర్డ్ మెంబర్ల ఆధ్వర్యంలో అంతర్గత, బాహ్య వ్యాపారాలు, ప్రభుత్వము, స్వచ్ఛంద సంస్థలతో, వ్యాపార సంస్థలతో కలిసి పనిచేస్తున్నారు. సిడబ్ల్యుపిపి ఎఆర్‌యంఎఎస్ వాష్ ప్రాజెక్టు ద్వారా ఎఫ్‌పిఓ మెంబర్స్‌కు ఆర్. లక్ష్మీపతి, ప్రాజెక్టు ఆఫీస్ సర్కార్ వారు వాష్ కార్యక్రమాలు కమ్యూనిటీ వాటర్ ప్లాంట్ గురించి వివరించిన తర్వాత ఏర్పాటు చేసుకోవడం కోసం గ్రూప్‌గా 5 మంది ముందుకు రావడమైంది.

**ఆ 5 మంది :** వి. చంద్రశేఖర్‌రెడ్డి, ఎస్. సూర్యప్రకాష్ రెడ్డి, కె. చంద్రశేఖర్‌రెడ్డి, కె. హరిహరరెడ్డి, కె. గోపాల్‌రెడ్డి. ఈ 5 గురు కలిసి ఫిబ్రవరి 2026 నెలలో మొదలుపెట్టి మే 7, 2026 తేదీన ప్రారంభించారు. జూన్ 19తేదీన వాటర్ ఆర్గ్ టీం, జోస్ గారు, సాయికిరణ్‌గారు, వాష్ ప్రాజెక్ట్ మేనేజర్ శ్రీనివాస్‌గారు సందర్శన చేశారు. ప్లాంట్ ఏర్పాటు, ప్లాంట్‌కి దాదాపుగా 8 లక్షలు ఖర్చు అయింది అని తెలియ జేసారు. నెలకు ఎంత ఆదాయం వస్తుంది, వీటి నిర్వహణ ఖర్చులు గురించి తెలుసుకొని ప్లాంట్ చాలా బాగుంది అని సంతోషం వ్యక్తపరిచారు. ప్లాంట్ మొత్తం ఎఫ్‌పిఓ సభ్యులు నిర్వహించడం జరుగుతుంది. ■

ఆరడుగుల మనిషి విలువ నాలుగంగుళాల నాలుకమీద ఆధారపడి వుంటుంది !

# గ్రామీణాభివృద్ధిలో ఆంధ్రప్రదేశ్‌కు జాతీయ గుర్తింపు!

గ్రామీణాభివృద్ధిలో రాష్ట్రానికి మరోసారి జాతీయ స్థాయి గుర్తింపు లభించింది. గ్రామీణాభివృద్ధి, మహిళా సాధికారత, గ్రామీణ మౌలిక వసతుల కల్పన, పేద కుటుంబాల ఆర్థిక భద్రత వంటి రంగాల్లో ఆంధ్రప్రదేశ్ దేశవ్యాప్తంగా తన ప్రత్యేకతను చాటుకుంది. కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ ఇటీవల విడుదల చేసిన 'కీ ఇండికేటర్స్ అండ్ అనలిటికల్ ఓవర్ వ్యూ ఆఫ్ స్కీమ్స్-2024-25' నివేదికలో ఉపాధి హామీ పథకం, దీన్‌దయాళ్ అంత్యోదయ యోజన, జాతీయ గ్రామీణ జీవనోపాధి మిషన్(డే-ఎన్ఆర్ఎల్ఎం), ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన (పీఎంజీవై), ప్రధానమంత్రి ఆవాస్ యోజన-గ్రామీణ్ (పీఎంఏవై-జీ) అమల్లో ఏపీ విశేష ప్రగతిని నమోదు చేసినట్లు వెల్లడైంది. గ్రామీణ పేదలకు ఉపాధి కల్పించడం, మహిళా సంఘాల ద్వారా ఆర్థిక కార్యకలాపాలను విస్తరించడం, బ్యాంకింగ్ సేవలను గ్రామస్థాయికి తీసుకెళ్లడం, కోట్లాది మహిళలకు బీమా రక్షణ కల్పించడం వంటి అంశాల్లో ఏపీ దేశంలోని ఒక అగ్రగామి రాష్ట్రంగా నిలిచిందని నివేదిక పేర్కొంది.

**ఉపాధి హామీ అమల్లో అత్యుత్తమ రాష్ట్రం**

ఉపాధి హామీ పథకం అమలుపై కేంద్రం చేసిన విశ్లేషణలో రాష్ట్రానికి అత్యున్నత గుర్తింపు లభించింది. సగటు పనిదినాలు, 100 రోజుల ఉపాధి పూర్తిచేసిన కుటుంబాల సంఖ్య వంటి కీలక సూచీల ఆధారంగా దేశంలో అత్యుత్తమ పనితీరు కనబరచిన రాష్ట్రాల జాబితాలో ఆంధ్రప్రదేశ్‌ను చేర్చింది. కేరళ, మిజోరం, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, ఉత్తరప్రదేశ్‌లతో పాటు ఆంధ్రప్రదేశ్‌ను కూడా స్ట్రాంగ్ పెర్ఫార్మర్‌గా కేంద్రం పేర్కొంది.

**మహిళా సంఘాల విప్లవానికి చిరునామా**

మహిళా స్వయం సహాయక సంఘాల ఉద్యమానికి ఏపీ చాలాకాలంగా మార్గదర్శక రాష్ట్రంగా నిలుస్తోంది. అదే విషయాన్ని కేంద్ర నివేదిక ధృవీకరించింది. రాష్ట్రంలో ప్రస్తుతం 7,65,863 స్వయం సహాయక సంఘాలు పనిచేస్తుండగా, వాటికి బ్యాంకుల ద్వారా రూ.41,759 కోట్ల రుణాలు పంపిణీ అయ్యాయి. దేశవ్యాప్తంగా మహిళా సంఘాలకు అత్యధిక రుణాలు అందించిన రాష్ట్రాల్లో ఏపీ రెండోస్థానంలో నిలిచింది.

**మహిళల భద్రతలో ముందంజ**

గ్రామీణ మహిళల సామాజిక భద్రత విషయంలోనూ ఏపీ విశేష పురోగతి సాధించింది. ప్రధానమంత్రి సురక్షా బీమాయోజన కింద 74,76,365మంది మహిళలు ప్రమాద బీమా పరిధిలోకి వచ్చారు. ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన కింద 52,28,705 మంది మహిళలు బీమా రక్షణ పొందారు. మహిళా సంఘాల ద్వారా బీమా పథకాల అమల్లో దేశంలో అత్యధిక లబ్ధిదారులు కలిగిన రాష్ట్రాల్లో ఒకటిగా ఆంధ్రప్రదేశ్ నిలిచిందని నివేదిక పేర్కొంది.

**కొనసాగుతున్న గ్రామీణ రహదారుల అభివృద్ధి**

ప్రధానమంత్రి ఆవాస్ యోజన-గ్రామీణ్ కింద ఆంధ్రప్రదేశ్‌లో 8333 ఇళ్లు పూర్తికాగా, 505 ఇళ్లకు కొత్తగా మంజూరు లభించింది. ఇళ్ల నిర్మాణంతో పాటు లబ్ధిదారులకు మరుగుదొడ్లు, విద్యుత్, తాగునీటి కనెక్షన్లు, ఎల్‌పీజీ గ్యాస్ వంటి మౌలిక సదుపాయాలను కూడా కల్పించడం రాష్ట్ర ప్రత్యేకతగా నివేదిక పేర్కొంది.

**పేదరిక నిర్మూలనకు సమగ్ర విధానం**

గ్రామీణాభివృద్ధి పథకాల అమల్లో ఆంధ్రప్రదేశ్ సమగ్ర దృక్పథంతో ముందుకు సాగుతోందని కేంద్రం అభిప్రాయపడింది. ఒక వైపు ఉపాధి హామీ ద్వారా ఆదాయం, మరో వైపు మహిళా సంఘాల ద్వారా స్వయం ఉపాధి, బ్యాంకు రుణాలు, బీమా, గృహ నిర్మాణం, గ్రామీణ మౌలిక వసతుల కల్పన ద్వారా గ్రామీణ కుటుంబాల జీవన ప్రమాణాలను మెరుగుపరిచే దిశగా రాష్ట్రం పనిచేస్తోందని విశ్లేషించింది. ■

ఆశాభావం అన్నిటినీ అనుకూలంగా మార్చే మంత్రదండం కాదు, దేనికైనా నిన్ను సిద్ధంచేసే మనోబలం !

# జీవనోపాధుల బలోపేతం

ప్రత్యామ్నాయ పంటల సాగు పద్ధతులు...
చిన్న, సన్నకారు రైతులకు అదనపు ఆదాయ మార్గాలు

## చేపట్టే పనులు




NABARD

RNI Regd.No: TELTEL/2003/16365 MAHILA SADHIKARATHA Postal Regd No: HCD-1064/2024-26
Publication Date:01-08-2026 Posting at BPC-1V Patrika Channel, Nampally, Hyderabad-500001 Posting Date: 05/06-08 -2026

# తాజాలు, మాజీలు కలుసుకున్న శుభవేళ !



ఏపిమాస్ ప్రస్తుత సిబ్బంది (పైన)... పూర్వ సిబ్బంది (క్రింద)



ఉల్లాసం, ఉత్సాహం .. ఆట .. పాట !



'వండర్‌లా' లో ఏపిమాస్ సిబ్బంది రజతోత్సవ సంబరం



కుమారి శర్మిష్ఠ నేతృత్వంలోని 'కళాక్షత' నృత్య బృందంచే కూచిపూడి నాట్య ప్రదర్శన



'లిటిల్ మ్యుజిషియన్స్ అకాడమీ' నుంచి సోని కొమండూరు, శ్రీహర్ష పాటల సందడి

To ADDRESS



రజతోత్సవ సారథి శ్రీ సి ఎస్ రెడ్డికి సన్మానం

బట్వాడా కాకపోతే దయచేసి ఈ చిరునామాకు తిప్పిపంపండి

ఎడిటర్, మహిళా సాధికారత, ఏపిమాస్ కార్యాలయం, ప్లాట్ నెం.11-12, హుడా కాలని, తానీషానగర్, డ్రీమ్‌వ్యాలీ దగ్గర, మణికొండ, రంగారెడ్డి జిల్లా, హైదరాబాదు-500089